ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 10 అక్టోబర్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
8. విజయదశమి శరన్నవరాత్రులు
9. శ్రీపతిస్తుతి
10. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
11. శమీ శమయతే పాపం...
12. భాగవతశ్రీపాదసంబంధవైభవమ్
13. జ్యోతిర్విజ్ఞానమ్
14. సందేహాలు-సమాధానాలు
15. బతుకమ్మ పండుగ ప్రత్యేకం
16. భాగవతంలో భగవంతుని కథలు
18. శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము
20. సమాశ్రయణములు
24. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్




## ముఖచిత్ర పరిచయం

ప్రతి ఉదయం మంచిపై చెడు విజయం సాధిస్తుందన్నది వాస్తవం. యుగ యుగాలుగా చరిత్ర చెబుతోంది. ఒక యుగంలో దుర్గామాత విజయం, మరోయుగంలో రాముడు రావణ సంహారంతో సాధించిన విజయం ఇలా చెప్పుకుంటూ వెళుతే ఎన్నో సందర్భాలు! విజయదశమి పర్వదిన వేళ శ్రీరాముని పూజిస్తూ, నాడు ఈ రోజునే రావణ సంహారం జరిగిందని గుర్తుచేసుకుంటూ రావణ సంహార ఘట్టాన్ని వేడుకగా నిర్వహించుకుంటారు. అలాగే దక్షణాదిలో దుర్గానవరాత్రులు వేడుకగా నిర్వహించి మహిశాసుర సంహార ఘట్టాన్ని స్మరించుకుంటారు. మనకు చరిత్ర ఒకటే చెప్పింది. చెడుపై నిరంతరం మంచే విజయం సాధిస్తుంది. యుగ యుగాలుగా జరిగిన సంఘటనలు చూస్తే సరిగ్గా ఇదే రోజు విజయదశమి రోజున అంకురార్పణ జరగడం యాదృచ్ఛికం. రాక్షస సంహారంతో ప్రజల క్షేమం, సుభిక్షం కాంక్షించారు. అందుకే వారిని నిరంతరం ధ్యానిస్తున్నాము. పూజిస్తున్నాము. రామావతార, కృష్ణావతార ఘట్టాలను, పురాణాలను స్మరించుకుంటూ వేడుక జరుపుకుంటాం! చెడుపై మంచి నిరంతరం విజయం సాధించాలన్న చిత్రకారుని కాంక్ష ఈ దృశ్యాన్ని ఆవిష్కరించింది.


**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహా చార్యులు



**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



## మంచిని గ్రహించేలా జాతి జాగృతం కావాలి

ఎవరికి ఎన్ని ఆలోచనలు వచ్చినా వారికి వచ్చిన ఆలోచనలే సరైనవని ముందుకు వెళ్లడం సహజం. వాస్తవం అవాస్తవంకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకోగలిగినప్పుడే జీవనం సార్థకం అవుతుంది. శాశ్వతమైనది సనాతన ధర్మం అని పెద్దలు చెప్పారు. అదే బాటలో భారత జాతి నడుస్తోంది. వందల సంవత్సరాలు విదేశీయులు దేశాన్ని పాలించి ఇక్కడి సంపదను దోచుకెళ్లారు. సంస్కృతీ సంప్రదాయాలను మట్టుబెట్టే యత్నం చేశారు. ఇలా సనాతన ధర్మం శాశ్వతమైనది కావడం వల్లనే అది మళ్లీ చిగురించి చక్కని మార్గాన్ని చూపుతోంది. పక్కదారి పట్టినవారిని సైతం దారిలోకి తీసుకురావడానికి నాటినుండి నేటి వరకు ఆచార్యపురుషులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. మనదేశంలో సనాతనం నుండి సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించబడుతున్నాయని చరిత్ర చెబుతోంది. దానికి ఆధారాలు ఉన్నాయి. సనాతన ధర్మం అంటే ఒక మతం కాదు. మానవ జీవన విధానం. అలాంటి ఆధారాలు ఇవిగో అంటూ ఇటీవల దేశ రాజధానిలో జరిగిన ప్రపంచ దేశాధినేతల సదస్సులో ప్రత్యక్షంగా పరోక్షంగా వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి. మనదేశానికి వచ్చిన వివిధ దేశాధినేతలకు ఇక్కడి పరిస్థితులను తెలియజెప్పాలిగా అందుకోసమే భారత్ ది మదర్ ఆఫ్ డెమక్రసీ అనే సుమారు 50 పేజీల వర్చువల్ పుస్తకాన్ని అందించారు. మనదేశంలో యుగయుగాలుగా సనాతన ధర్మం నెలకొని ఉన్న విధానాన్ని వివరించారు. ఇప్పటికే భారత జాతి వారసత్వ సంపద, విజ్ఞానానికి సమూలంగా నష్టం జరిగింది. మళ్లీ మన సనాతన ధర్మానికి జీవం పోయడానికి చేసిన చిరుప్రయత్నం భారత జాతి గర్వించే అంశాలు ఎన్నో ఈ బ్రోచర్ (పుస్తకం ద్వారా) మనముందు ఆవిష్కృతమయ్యాయి. కలియుగానికి ముందు ఆతర్వాత ఆవిష్కృతమైన అంశాలను ఇందులో ప్రస్తావించారు. నాగరికత మూలాధారాన్ని ఉదహరించారు. ఇవి అన్నీ వాస్తవాలు, యథార్థాలు వీటిని ఎవరూ కాదనలేరు. 1100 నుంచి 1500వరకు భారతావనిపై ఆవిర్భవించిన విశిష్టవ్యక్తులను ప్రస్తావించారు. వీరిలో భగవత్ రామానుజాచార్యుల వారు, మరెందరో తత్వవేత్తలు, సాధువులు, కవులు, మహనీయులు ఉన్నారు. శతాబ్దాలుగా వారు బోధించిన అంశాలను ప్రస్తావించారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే అన్న శ్రీరామానుజాచార్యుల బోధనలను ఇందులో ప్రస్తావించారు. ప్రాచీనంగా వస్తున్న చరిత్రను దృశ్యరూపంగా భారత జాతి మనోభావాలను ఆవిష్కరించారు. ఒక రకంగా చెప్పాలంటే చాలా వరకు కనిపించిన ఈ బుక్‌లెట్‌లో దర్శనం ఇచ్చే చిత్రాలన్నీ నూతన పార్లమెంటు భవనంలో ఆవిష్కృతమైనవి కావడం విశేషం. జాతి ఔన్నత్యానికి ఇస్తున్న విలువకు నిదర్శనంగా ఇవి నిలుస్తున్నాయి. సనాతన ధర్మానికి జీవనాడిలా భగవద్గీత ఔన్నత్యాన్ని చాటే మరో సంఘటన ఇక్కడ వర్చువల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కనిపిస్తుంది. మానవుని జీవన విధానంలో ఎదురైన జవాబు దొరకని ప్రశ్నలకు ఇక్కడ జవాబు లభిస్తుంది. ముందుగా ఈ వర్చువల్ మానిటర్ ముందు ప్రశ్న అడగదలుచుకున్న వ్యక్తి పేరు, వయస్సు, తదితర వివరాలను నమోదుచేశాక అడగదలచుకున్న ప్రశ్నను అడగవచ్చు. వెంటనే తగు జవాబు వస్తుంది. ఆతర్వాత భగవద్గీతలో శ్లోకం ఒకటి దర్శనం ఇస్తుంది. భారత జాతిని ఒక త్రాటిపై నడవడానికి, సమైక్యంగా నిలబడడానికి ఇవి దోహదం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవాన్ని సరైన దృష్టితో చూడగలిగినప్పుడే సరైన ఫలితాలు మనం పొందగలం. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ మన జీవన మార్గం కావాలి. సనాతన ధర్మం విజ్ఞానాలరాశి అన్న విషయం గమనించాలి. ఇవి మూఢనమ్మకాలు కావు. వాటికి వైజ్ఞానికమైన ఆధారాలు ఉన్నాయని ఎవరో ఒకరు పరిశోధన చేసి ప్రకటిస్తే, వారిని సత్కరిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. పదిహేను రోజులలో ఒకరోజు ఆహారం తీసుకోకుండా ఉండటంవల్ల అది ఆరోగ్యకారకం అవుతుందని చెప్పిన జపాన్ వైజ్ఞానిక వేత్తకు నోబెల్ పురస్కారం ఇచ్చి సత్కరించింది. సనాతన ధర్మంలో ఉన్న మంచిని గమనించడానికి మార్గం ఇదీ! అంటూ భారతదేశ ఔన్నత్యాన్ని చాటే యత్నం చేశారు. కానీ ఇవన్నీ సనాతనం అంటూ సనాతన ధర్మం అన్న పదానికి వక్రభాష్యం చెప్పడానికి ఎక్కువ మంది కంకణం కట్టుకున్నారు. పోలికలేని విషయాలను ప్రస్తావిస్తున్నారు. వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారు. మంచిని గ్రహించే ప్రయత్నాన్ని పక్కన పెడుతున్నారు. ఈ సందర్భంలో ప్రవచనకర్తలు, మేధావులు, ఆధ్యాత్మిక వేత్తలు జాగృతం కావాలి. భారత జాతిని జాగృతం చేసే పనికి నడుం బిగించాలి.

–వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారీ పంచాంగమ్

భాద్రపద మాసం 15-09-23 శుక్లపక్షంతో ప్రారంభమై 14-10-23 వరకు. తదుపరి ఆశ్వయుజం

10-10-2023 వరకు హస్తా కార్తి, 11-10-2023 నుండి 24-10-2023 చిత్త కార్తి. 25-10-2023 నుండి స్వాతి కార్తి, **పండుగలు :** 02-10-23 సంకష్ఠహర చతుర్థి, గాంధీ జయంతి, 10-10-23 సర్వేషాం ఏకాదశి, 13-10-23 మాస శివరాత్రి, 14-10-23 మహాలయ అమావాస్య (పెద్దలకు బియ్యం ఇచ్చుట), బతుకమ్మ ప్రారంభం, 15-10-23 శరన్నవరాత్రారంభం, 18-10-23 తులా సంక్రమణం, 22-10-23 దుర్గాష్టమి సద్దుల బతుకమ్మ, 24-10-23 విజయదశమి (దసరా శమీపూజ) 25-10-23 సర్వేషాం ఏకాదశి, 28-10-23 వాల్మీకి జయంతి, చంద్రగ్రహణం

## మాస ఫలాలు



**మేషం:** చేయు వృత్తివ్యాపారములందు అనుకూలత, ఆదాయంనకు లోటుండదు. నెలమధ్య నుండి కోపం పెరుగును. భూసంబంధ వ్యవహారాలందు జాగ్రత్త.



**వృషభం:** ఈనెల అనుకూలంగా ఉంది. చేయు వృత్తి వ్యాపారములందు రాణింపు ఉంటుంది. ఆరోగ్యం బాగుండును. ప్రతీ పనిలో విజయం సాధించెదరు. ఆర్థికంగా బాగుండును.



**మిథునం:** ఈనెల అనుకూలం. మీ మాటకు ఎదురులేకుండా పోవును. కుటుంబంలో శుభ కార్యాలు, భూసంబంధ వ్యహారాలు కలిసి వచ్చును.



**కర్కాటకం:** ఈనెల గ్రహ సంచారం అనుకూలం. ఎంతటి కార్యాన్నైనా అవలీలగా పూర్తిగాచేయగలరు. ఆరోగ్యం ఆర్థిక సమస్య లుండవు. నూతన పరిచయ లాభాలు, వ్యవహారాలు మీకు అనుకూలం.



**సింహం:** అన్నిరంగాలవారికి అనుకూలమే. ధనం చేతికందును. వ్యవహారాలందు బాధ్యతతో ఉంటారు. వాహన సౌఖ్యం,సంతానసౌఖ్యం, వ్యవహారజయం, శతృజయం.



**కన్య:** ఈ నెల గ్రహస్థితి అనుకూలంగా ఉండుట వల్లగత కొద్దినెలలుపడుతున్న ఇబ్బందులనుండి కొంతఊరట. అన్నిరంగాలవారికి బాగుంటుంది. ఆరోగ్యం బాగుండును. ధైర్యసాహసాలు పెరుగును



**తుల :** ఈనెలలో జన్మరాశిలో గ్రహసంచారంవల్ల చేయువృత్తి వ్యాపారాలందు రాణింపుఉండదు. ఉద్యోగులకు బదిలీలు తప్పవు. శారీరకశ్రమతప్పదు.



**వృశ్చికం:** ఈ నెల కొంత ఇబ్బంది. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి. ధనవ్యయం చేయుదురు.

### గ్రస్తోదయ పాక్షిక చంద్రగ్రహణము



తేది 28.10.2023 శనివారము రాహుగ్రస్త ఖండగ్రాస చంద్రగ్రహణం. స్పర్శకాలము రా 1-06, మధ్యకాలము రా 1-44. మోక్ష కాలము రా 2-25, ఆద్యంత పుణ్యకాలము రా 1-37. అశ్విని నక్షత్రం మేష, తుల, మీన రాశులవారు చూడకూడదు. సా॥ 4-0 నుండి గ్రహణవేధ ప్రారంభమగును సా॥ 4-0 లోపు భోజన ప్రత్యబ్ధములు ముగించుకొనవలెను.

ఆర్భాటములకు, విలాసములకు ధనం. ఖర్చుచేస్తారు. కొంతశ్రమ పడవలసి వచ్చును. ప్రయాణాలందు జాగ్రత్తగా ఉండాలి



**ధనుస్సు:** ఈ నెల వ్యాపారులకు లాభములు. నూతనవాహన, తీర్థయాత్రా ఫలప్రాప్తి, సంతోష వార్తలు వింటారు. వివాహాది శుభ కార్యములకు హాజరగుదురు. ప్రయాణాలు కలిసి వచ్చును.



**మకరం:** ఈ నెల ఆర్థిక, ఆరోగ్యలాభము, ధైర్యంతో ముందుకు పోగలరు. ప్రతీ విషయంలో ఆధిక్యత కొనసాగును. నూతన వస్తు ప్రాప్తి, వాహనసౌఖ్యం,



**కుంభం:** ఈ నెల కొంతమేర రాణింపు ఉంటుంది. ఆదాయం బాగుంటుంది. ఆరోగ్యం బాగుండును. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తిచేయగలరు. అనుకోని ఖర్చులు ఎదురగును.





**మీనం:** ఈ నెల అనుకూలంగా ఉండదు. ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చును. ఆరోగ్యం జాగ్రత్త.

### మంచి రోజులివిగో...

ఈనెల వివాహ, గృహఆరంభ, ప్రవేశ శుభముహూర్తములు లేవు

దారిద్ర్య, ఋణ, ఈతి బాధలు తొలగించే

# శ్రీలక్ష్మీనంబులాద్రి స్వామి


సనాతన దేవాలయమైనట్టి శ్రీలక్ష్మీనరసింహస్వామి, నంబులాద్రి దివ్యక్షేత్రం దాదాపు నాలుగువేల సంవత్సరాల పురాతనమైనది అని ప్రసిద్ధి. శిలాశాసనాలు ఏవి లభ్యము కాకపోయినప్పటికీ సనాతమైన శిల్పకళ కాకతీయుల కాలం నాటిదని తెలియజేస్తుంది. ఇక్కడ లక్ష్మీనంబులాద్రిస్వామి అనే ప్రత్యేకత వున్నది. నంబులు అనగా పూర్వకాలంలో ఈ కొండపైన (నంబుల అద్రి) అపారమైన అర్చక స్వాములు నివాసముండేవారు. దాదాపు నలభై కుటుంబాలు స్వామిని ఆశ్రయించు కొని జీవించేవారు. ఈ కొండపైన అర్చకుల ముఖోల్లాసంతో పరమాత్మ ముఖం వికసించేదట. అర్చకో హరి సాక్షాత్ అని పెరుమాళ్ళకు ఎంతమంది అర్చకులుంటే అంత ఆనందం. అందుకే నంబుల అద్రి అనే తత్వం కలిగింది. ఇది దివ్యక్షేత్రం. ఎందుకంటే ముందు భాగంలో దివ్యమైన కోనేరు వున్నది. మరియు ఉద్యానవనము లో న్యగ్రోధం, అశ్వత్థము అనే పంచపల్లవాలకు సంబంధించిన ఓషధీ మొక్కలు ఉన్నాయి. కొండ అపారమైన వృక్ష సంపదతో అలరారుతున్నది. ఈ దివ్యక్షేత్రం ఆళ్వార్లు దివ్యప్రభంధం గానం చేసినట్టుగా ఉంటుంది. భగవద్రామానుజాచార్యుల ఆంతరంగిక శిష్యుడైనటువంటి కూరేశులు ఈ క్షేత్రంలో వేంచేసియున్నారు. కూరేశులు అనగా కూరత్తాళ్వార్. వీరి దివ్యస్థానం తెలంగాణలో ఎక్కడా లేదు, వారి కుమారులైన వ్యాసభట్టర్, పరాశరభట్టర్‌తో పాటు వేంచేసి యున్నారు. అలాగే స్వామి వారియొక్క వామ భాగంలో ఆండాళ్,





పన్నిద్దరు ఆళ్వార్లు, భగవద్ రామానుజాచార్యులు వేంచేసి యున్నారు. కొండ శిఖరంపైన క్షేత్రపాలకుడైన పది అడుగుల ఎత్తులో ఆంజనేయ స్వామి ఉన్నారు. ఇది అందరికి ఇలవేల్పైనటువంటి క్షేత్రం. పెద్దపల్లి పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో చక్కటి రవాణా సౌకర్యముతో అలరారుచున్నది. ఇక్కడ పారంపరిక అర్చకులుగా కొండపాక వాళ్ళ వంశమే అన్నీ కార్యక్రమములు చేస్తుంది. ప్రతి మాఘ శుద్ధ ఏకాదశికి స్వామివారి బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమంగా నిత్య అర్చనలు జరుగుతాయి. మారుమూల పల్లెలో వున్నా ఎంతోమందిని ఆకర్షిస్తూ ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, తెలంగాణా, మధ్యప్రదేశ్ అన్ని రాష్ట్ర భక్తులను ఆకర్షిస్తున్నది. కొంగుబంగారమైన ఈ క్షేత్రంలో మొక్కుకొని కొబ్బరికాయలు ముడుపులు కడతారు. స్వామిని నమ్ముకున్నవారందరికి కోరికలు నెరవేరుతాయి. శ్రీభాష్యాన్ని ఏకసంథాగ్రాహిగా గ్రహించినటు వంటి కూరేశుల సాన్నిధ్యంలో అక్షర స్వీకారం చేసుకొంటారు. అర్చకులు శ్రీమాన్ శ్రీ కొండపాక రామాచార్యులు, శ్రీమాన్ శ్రీ కొండపాక సత్యనారాయణాచార్యులు, శ్రీమాన్ శ్రీ కొండపాక వెంకటాచార్యులు, శ్రీమాన్ శ్రీ పెద్ద రామాచార్యులు, శ్రీమాన్ శ్రీ కృష్ణమాచార్యులు. పూర్వార్చకులు శ్రీమాన్ శ్రీ కొండపాక పాపలాచార్యులు శ్రీమాన్ శ్రీ గోపాలాచార్యుల కుమారులు. వీరి సంతతివారే నిత్య కైంకర్యం చేస్తున్నారు.




ఇక్కడ స్వామి స్వయంభువుగా సాలగ్రామ శిలగా వెలసినారు. స్వామి పర్యంకం పైన అమ్మవారు వేంచేసి యున్నారు. సకల దోషములను హరించే లక్ష్మీదేవితో కలిపి నంబులాద్రి అనకుండా ఈ దివ్యక్షేత్రాన్ని శ్రీలక్ష్మీనంబులాద్రి స్వామి అంటారు. ఇక్కడకు వచ్చినవారికి దారిద్ర, ఋణ ఈతి బాధలు తొలిగిపోతాయి.






# నారీ జన సేవిత రామానుజ

- శ్రీమతి సముద్రాల శారద

కాలగమనంలో ఎన్ని మార్పులు జరిగినా ప్రపంచ దేశాల్లో భారతదేశ ఉత్కృష్ట స్థానం మారదు. సనాతన ధర్మం అనే భావనను ఎంత వక్రీకరించినా సూర్యునిపై వీచే ధూళిలా పటాపంచలు కావలసిందే! ఆ వేద ధర్మం సంస్కృతి అనే ఒక అమృత భాండంగా సాంప్రదాయ సిరిగా మన కందించబడింది. అది ఆచరణ రూపంలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. ఆస్తిక భావపరంపరను శాశ్వతం చేస్తుంది. పరమ లక్ష్యం కోసం జనజీవనం ఉజ్జీవనంగా మారేలాగా, జీవితం పరమార్థం వైపు సాగేలా నడిపించటానికే మన ఆచార్యులు అవతరించారు. పవిత్ర భారతావని ప్రసిద్ధ స్థానమందు నిలవడానికి మూలము వేద విహితమైన ధర్మాచరణమే!



అందులో ప్రధానమైనది ఇంద్రియ నిగ్రహము. ఎందరో మహా పురుషులు ఆధ్యాత్మిక పరిపక్వత సాధించటానికి మూలం మనో నిగ్రహ సాధన. లోక కళ్యాణ కాంక్ష. ప్రాచీన భారతీయ వాఙ్మయం కూడా ఇంద్రియాలను జయించే మార్గాలను సూచించింది. అణిమాది అష్టసిద్ధులు సాధించడానికి అయినా మంత్ర సిద్ధి, యోగసిద్ధి పొందడానికైనా చివరికి మోక్ష సాధనకు కూడా ఇంద్రియ నిగ్రహము, వైరాగ్యమే ప్రధానమైనవి.

**“జాయంతే చ మ్రియంతే చ కేవలం జీర్ణ జంతవః**
**న ధర్మాయ న మోక్షాయ మశకా యివ పంకజే”** అనగా పంకజ మందు వాలి నశించే క్రిమి కీటకాల వలె వ్యర్థమైన విధంగా పుట్టడం మరణించడం మళ్ళీ పుట్టడం కేవలం ఇంద్రియ వ్యామోహం వలన సంభవిస్తుందని పెద్దలు చెప్పారు. ఆ విధంగా కలిగే వైరాగ్యమే మానవుల జాగృతికి మూలం. అందుకే జ్ఞాన వైరాగ్యాలు మోక్ష సాధన మార్గాలుగా చెప్పబడ్డాయి. కేవలం శరీర వ్యామోహంతో కాక గొప్ప జీవన విధానాన్ని భారతీయ సంస్కృతి సూచిస్తుంది. కనుకనే విశిష్ట స్థానంలో నిలిచి ఉంది.

జ్ఞాన వైరాగ్యములతో పాటు భక్తి ప్రపత్తులు కూడా భగవత్ ప్రాప్తికి సాధనాలుగా శ్రీ రామానుజ మార్గం సూచిస్తుంది. దుఃఖదాయకమైన లౌకిక వ్యామోహాలను వదిలి భగవత్ సంబంధ మైన ప్రీతి ఉండ తగినది అని సాంప్రదాయం బోధిస్తుంది. లౌకిక సౌందర్యం కాకుండా జగన్మోహనుడై, సౌందర్య రాశి అయిన అర్చా మూర్తి యగు శ్రియఃపతిని ఆరాధించాలని, స్త్రీ పురుష భేదం లేక ప్రతి ఒక్కరూ పరమార్థమైన జీవిత లక్ష్యంతో జీవించి తరించాలని రామానుజాచార్యులు బోధించారు.

వారి స్ఫూర్తి, సూక్తి, మార్గం, సదా అనుసరణీయమైనవి. వారి జీవిత కథా మాధురిలో ఎన్నో సన్నివేశాలు మన జీవితాలకు మంచి దారిని సూచిస్తాయి. సహజ సున్నిత హృదయులు అయిన ఉత్తమ నారీమణుల హృదయాలలో భక్తి బీజాలను నాటడంలో ఆశ్చర్యం లేదు! పరమ కారుణికులై నారీ జన పూజితులై భగవద్ రామానుజాచార్యులు జగదాచార్యులైనారు. వారిని ఆరాధించి తరించిన వారిలో హేమాంబ, పరుత్తి కొల్లి అమ్మ గురించి తెలుసుకుందాం!

**హేమాంబ:** ఉరైయూరులో నివసించే గొప్ప మల్ల యోధుడు వీరిని ‘పిళ్లై ఉరంగా విల్లి దాసర్’, ధనుర్దాసు అంటారు. భార్య పొన్నాచ్చియార్ ఈమెను హేమాంబ అంటారు. సంపన్నుడు ధైర్యవంతుడు అయిన ధనుర్దాసును అందరూ గౌరవించేవారు. ఆ కాలంలో శ్రీరామానుజాచార్యుల

# నారీ జన సేవిత రామానుజ

పర్యవేక్షణలో శ్రీరంగనాథ పెరుమాళ్ళ ఉత్సవాలు వైభవంగా జరిగేవి. ఆ ఉత్సవాలకు ధనుర్దాసు హేమాంబ కూడా వచ్చారు. మోహించే నేత్రాలతో సౌందర్యవతి అయిన భార్యను సౌందర్యారాధకుడైన ధనుర్దాసు ఆమెకు కాలు కందకుండా, ఎండ తగులకుండా వీధిలోనే ఉపచర్యలు చేస్తూ నడుస్తున్నాడు. చూపరులంతా ఆశ్చర్యపోయారు. శిష్యగణపరివేష్ఠితుడై ఆ మార్గంగా వచ్చే రామానుజాచార్యులు చూశారు. లౌకిక సౌందర్యాన్ని ఆరాధించే ఇతను అలౌకిక సౌందర్య పరాకాష్ఠ అయిన భగవత్ సౌందర్యాన్ని చూస్తే మరింత పరవశుడు అవుతాడు అని భావించి అతనిని దిద్దుబాటు చేయ సంకల్పించారు. వెంటనే ధనుర్దాసుతో సంభాషించి సాటి లేని సౌందర్య రాశి అయిన శ్రీ రంగనాథ స్వామి నేత్ర సౌందర్యానికి వశుడను గావించారు.

నాటినుండి ధనుర్దాసు హేమాంబలు భగవద్భక్తితో ఆచార్య సేవా దీక్షతో జీవించారు. నిత్యం యతి రాజులు కావేరిలో స్నానం చేసి ధనుర్దాసు ఆసరా పట్టుకుని ఆశ్రమం చేరే వారట! ఈ విషయం జీర్ణించుకోలేని కొందరు శిష్యులకు గుణపాఠం చెప్పదలచి జగదాచార్యులు ఒక సన్నివేశం కల్పించారు. ఒకసారి ఆరవేసిన శిష్యుల వస్త్రాలు చిరిగి పీలికలుగా కనిపించగా వారు ఒకరినొకరు 'నువ్వే చేశావని' నిందించుకున్నారు. అది గమనిస్తూనే యతి రాజులు వారిని మరొక పనికి పురమాయించారు.

హేమాంబ నివసించే ఇంటికి వెళ్లి ఆమె ధరించిన ఆభరణాలను తీసుకొని రమ్మని ఆజ్ఞాపించారు. వారట్లే వెళ్లి నిద్రిస్తున్న హేమాంబ ఒంటిపైన ఒకవైపు ఆభరణాలన్నీ సంగ్రహించారు. అది తెలుసుకొని హేమాంబ వైష్ణవ స్వాములకు ఇబ్బంది కలిగించరాదని నిద్రను నటిస్తూ మరొకవైపు తిరిగింది. వారు ఆమె మేల్కొందని భయపడి వెళ్లిపోయారు. ధనుర్దాసు ఈ విషయం తెలుసుకొని వైష్ణవ స్వాములకు ఇబ్బంది కలిగినందుకు చింతించి, భార్యను కోపించి ఆచార్యులకు క్షమాపణ తెలిపారు. హేమాంబ కూడా క్షమించమని ప్రార్థించింది. హేమాంబ ఆచార్య భక్తి, సంప్రదాయ నిష్ఠ అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

శ్రీరామానుజాచార్యులతో ఉపదేశం పొందిన హేమాంబ తాత్త్విక జ్ఞానం సాటి లేనిది. ఒకసారి కొందరు వైష్ణవ స్వాములు శ్రీరామానుజాచార్యుల ఆజ్ఞతో "ఆత్మకు ఆచార్యులు ఎందరు"? అని ప్రశ్నించారట! వెంటనే పొన్నాచ్చియార్ తన పొడుగాటి కొప్పును విప్పి విదిల్చి తిరిగి ముడి వేసి సూర్యుని వైపు చూసి నమస్కరించి, "దాసురాలికి తెలియదు ఆచార్యులనే అడగండి" అని నిష్క్రమించిందట! కొప్పులోని వెంట్రుకలవలె అనేకమంది అఖిల వైష్ణవులు ఆచార్యులే అయినను, ఉత్తారకత్వము గలవారు శ్రీ రామానుజాచార్యులు మాత్రమే! వారే రామానుజ దివాకరులు. అని అభినయించిన శ్రీవైష్ణవ నారీమణి హేమాంబ!

**పరుత్తి కొల్లి నాచ్చియార్:** వరదాచార్యులు పరుత్తి కొల్లియమ్మ దంపతులు. వీరు పేద వైష్ణవులు గొప్ప ఆచార్య నిష్ఠ గలవారు. భగవద్ రామానుజాచార్యుల తిరుమల ప్రయాణమందు మధ్యలో విడిది చేయవలసి వచ్చి శిష్యులగు వీరింటికి వచ్చారు. చిన్న గుడిసెలో నివసిస్తూ ధరించే వస్త్రాలు కూడా సరిగ్గా లేని పరిస్థితుల్లో ఇంటికి వచ్చిన ఆచార్యులకు ఎదురు వెళ్లలేక ఆమె చింతించింది. అంతటి పేదరికంలోనూ వారికి ఆతిథ్యం ఇవ్వాలని సంకల్పించింది. తనపై వ్యామోహం గల ధన మదాంధుడైన వర్తకుని వద్దకు వెళ్లి ధనాన్ని స్వీకరించి; ఆతిథ్యాన్ని ఏర్పాటు చేసింది. సర్వం తెలుసుకున్న జగదాచార్యులు. ఆమెను కటాక్షించి ఆ వ్యాపారి పరివర్తన చెందే విధంగా శ్రీపాద తీర్థాన్ని పంపించారు. పరుత్తి కొల్లియమ్మ గొప్ప ఆచార్య భక్తి కలిగిన నారీమణి.

**విష ప్రయోగం చేసిన స్త్రీ:** కులీనులై అర్చకులై ఉండి ఈర్ష్యాగ్రస్తులైన కొందరు యతి రాజుల వైభవాన్ని చూడలేక విష ప్రయోగం చేయ సంకల్పించారు. నిత్య భిక్షకై సంచారం చేస్తూ యతి నియమాలను పాటించేవారు జగదాచార్యులు. మత్సరుడగు తన భర్త ఆజ్ఞను శిరసా వహించి వారికి విష భిక్షను ఈయటానికి సిద్ధపడింది ఒక స్త్రీ. కానీ ఉత్తమ నారీమణి అయిన ఆమె ఆచార్య భక్తితో చింతించింది. భిక్ష వేసే సమయంలో నమస్కరించకుండా భిక్షను సమర్పించింది. మరియు భయ విహ్వల అయిన ఆమె ముఖ కవళికలు చూసి సర్వం గ్రహించిన యతిరాజులు భిక్షను స్వీకరించారు. కాని ఆ పదార్థాన్ని కావేరీలో సమర్పించి ఆమెను అనుగ్రహించారు.

రామానుజ మార్గం అంటేనే క్షమ, సహనం, సహకారం, సమభావం. ఎందరో నారీమణులు జగదాచార్యులను పూజించి వారి ఉపదేశములను విని ఆచరించి తరించారు. ★



# విజయదశమి శరన్నవరాత్రములు

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

కాలము భగవత్స్వరూపము క్షణ, లవ, కాష్ఠాదులుగానూ, దిన, పక్ష, మాస, అయన సంవత్సరాదులుగానూ లెక్కింప కాలము శుభా శుభ ఫలితములను కలుగజేయు స్వభావము గలది. వైదికములైన శుభ కర్మలను ఆచరించుటకు తగిన శుభ కాలమును జోతిష్య శాస్త్రము నిర్ణయిస్తుంది. అట్లే ధర్మ శాస్త్రములు, ఇతిహాస పురాణాదులు కూడా కొన్ని ప్రత్యేకములైన వ్రతాదులు ఆచరించటానికి తగిన కాలమును విధించాయి.

వసంత ఋతువు వైదికములైన సత్కర్మలకు తగిన కాలము. అలాగే శరత్ ఋతువునందు కూడా కొన్ని ప్రత్యేకములైన వ్రతాదులు ఆచరించమని ధర్మశాస్త్రము విధిస్తున్నది. పురాణములను అనుసరించి వసంత ఋతువు ఆరంభంలో అనగా చైత్ర శుద్ధ పాడ్యమి (సంవత్సరాది) నుండి చైత్ర శుద్ధ నవమి (శ్రీరామ నవమి) వరకు వసంత నవరాత్రములను చేయు ఆచారము మన భారతీయ సంప్రదాయంలో ఉన్నది. అలాగే శరత్ ఋతువు ఆరంభంలో అనగా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు (మహర్నవమి) శరన్నవ రాత్రములను భక్తితో చేసే సంప్రదాయం ఉంది. వీటికే దేవీ నవరాత్రములనే పేరు ప్రసిద్ధిని పొందింది.

అయితే ఈ శరన్నవరాత్రములలో అమ్మవారిని పూజించిన విధంగానే శ్రీరాముని పూజించే సాంప్రదాయం కూడా ఉంది. కానీ ప్రధానంగా ఈ శరన్నవరాత్రములు శక్తి పూజకు ప్రధానములుగా లోకప్రసిద్ధిని పొందాయి. దానికి కారణం ఈ నవరాత్రాలలో మూలా నక్షత్రం నాడు 'సరస్వతి పూజ' చేసే ఆచారం ఉండటం, దుర్గాష్టమి అలాగే విజయదశమి నాడు మహిషాసురుణ్ణి అమ్మవారు వధించి విజయం సాధించినదనే పురాణగాథలను అనుసరించి, అదేవిధంగా దేవీపురాణం, డామర తంత్రం, స్కాంద పురాణం మొదలైనవి.

**మాసి చాశ్వయుజే శుక్లే నవరాత్రే విశేషతః।**
**సంపూజ్య నవదుర్గాం చ నక్తం కుర్యాత్ సమాహితః॥**

అంటూ "ఆశ్వయుజ శుక్లపక్షంలో నవరాత్ర క్రమంలో నవదుర్గా పూజను చేసి, నక్త వ్రతమును శ్రద్ధగా చేయవలెనని శక్తి పూజను విధిస్తున్నాయి.

'రుద్ర యామల' మనే తంత్ర గ్రంథం

**మూల ఋక్షే సురాధీశ పూజనీయాం సరస్వతీమ్**
**పూజయేత్ ప్రత్యహం దేవ యావద్వైష్ణవ మృక్షకం**
**నాధ్యాపయేత్ న చ లిఖేత్ నాధీయాత కదాచన**
**పుస్తకే స్థాపితే దేవ విద్యా కామో ద్విజోత్తమః**

ఓ దేవేంద్రా! నవరాత్రములలో వచ్చు మూలా నక్షత్రం నాడు సరస్వతీ పూజను పుస్తకములపై అమ్మవారిని ఆవాహన చేసి ప్రారంభించి, శ్రవణా నక్షత్రము నాటి వరకు కొనసాగించాలి. సరస్వతీ పూజను ప్రారంభించిన తరువాత ఉద్వాసన జరిగే వరకు అనగా విజయదశమి వరకు చదువుకొనటం, చదువు చెప్పటం, వ్రాయటం వంటివి విద్యాకాముడు చేయరాదు. కేవలం అమ్మవారి పూజలోనే గడపవలెను. అని నవరాత్రులలో సరస్వతి పూజా విధానాన్ని పేర్కొన్నది.

మార్కండేయ పురాణంలో మహిషాసురమర్దని లక్ష్మీదేవియే అని చెప్పబడింది. కొన్ని పురాణాలలో దుర్గాదేవి మహిషాసురమర్ధని అని చెప్పబడింది. కనుక ఈ శరన్నవరాత్రములలో లక్ష్మీ సరస్వతీ, గౌరీ దేవతలను ముగ్గురిని పూజించే విధానం కనిపిస్తుంది.


శ్రీవైష్ణవ ఆగమాలలోనూ ఈ శరన్నవరాత్రారాధన ప్రముఖంగా కనిపిస్తుంది. పరమపురుష సంహితలో

**ఆశ్వినస్య సితే పక్షే నవమ్యాంతు మహోత్సవం**
**వీరలక్ష్మ్యాస్తు కర్తవ్యం ప్రత్యబ్దం చ ధరాతలే ।**
**యస్మా దేషా జగన్మాతా పురుషాకారరూపిణీ**
**తస్మాత్ తస్యాస్తు సంప్రీత్యై కర్తవ్య మిద ముత్సవమ్ ॥**

అంటూ "ఆశ్వయుజ శుక్ల పక్ష నవమి నాడు వీరలక్ష్మీ ఆరాధన, పురుషకార రూపిణియైన లక్ష్మీదేవి జగన్మాత, ఆమె ప్రీతికొరకు మహా నవమి నాడు ఆమెకు ప్రత్యేకమైన మహోత్సవం చేయాలి అని చెప్పబడింది.

మహా విష్ణువు వక్షఃస్థలంలో నెలకొన్న లక్ష్మి "యోగ లక్ష్మీ" అని, ఆయన ప్రక్కన పూజలందుకొనే లక్ష్మి "భోగలక్ష్మీ" అని, ప్రత్యేకమైన ఆలయంలో చతుర్భుజాలతో విరాజిల్లు లక్ష్మి "వీరలక్ష్మీ" అని ఆగమ శాస్త్రములు తెలిపాయి. అందుకే శ్రీవైష్ణవాలయాలలో లక్ష్మీ దేవిని ఈ మూడు విధాలుగానూ పూజిస్తారు. (మిగతా 23 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి



ప్రాతర్నిత్యాను సంధానంలో

'కృష్ణాష్టకం'

(గత సంచిక తరువాయి)

**6. శ్లో॥ రుక్మిణీ కేళిసంయుక్తం పీతాంబర సుశోభితమ్ ।**
**అవాప్త తులసీ గంధం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

ప్రతిపదార్థం : రుక్మిణీ = రుక్మిణీ దేవితో, కేళి సంయుక్తం = విహరించు చున్నట్టి, పీతాంబర = పసుపుపచ్చ వస్త్రము ధరించి, సుశోభితం = అందంగా ప్రకాశించుచున్న, అవాప్త = పొందబడిన, తులసీ గంధం = తులసి పరిమళము గల, జగద్గురుం = లోకాచార్యుడైన, కృష్ణం = కృష్ణుని గూర్చి, వందే = నమస్కరించుచున్నాను.

శ్రీకృష్ణుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు అట్లే రుక్మిణీ దేవి శ్రీలక్ష్మీదేవి. కాబట్టి ద్వాపర యుగంలో రుక్మిణి కుండిన నగర రాజు భీష్మకునకు గారాల కూతురుగా జన్మించింది. ఐతే ఆమె అన్న రుక్మి అనే వాడు రుక్మిణిని శిశుపాలునకిస్తనని ప్రయత్నం చేశాడు. కాని రుక్మిణీ దేవి "అగ్నిద్యోతనుడు' అనే బ్రాహ్మణునితొ శ్రీకృష్ణుని వద్దకు ప్రేమ సందేశం పంపింది. అంతకు ముందే కృష్ణుడు రుక్మిణి సౌందర్య గుణాలు తలచుకొని ఆమెను వివాహమాడాలని తలంచినాడు. ఇప్పుడు ఆమెనే స్వయంగా ప్రేమ సందేశం పంపగా ఆనందించి ఆమె వూరికి వెళ్లి, ఆమె గౌరీ పూజ చేసి గుడి వెలుపలికి రాగా ఆమెను రథంపై ఎక్కించుకొని, ఎదురువచ్చిన రాజులను ఓడించి, 'రుక్మి' ని అవమాన పరచి, తన నగరానికి తెచ్చుకొని వివాహమాడినాడు. కావున రుక్మిణీ కేళిలో ఆనందాన్ని పొందేవాడు. 16 వేలమంది గోపికలు, 7 గురు భార్యలున్నా రుక్మిణియే కృష్ణునికి ఇష్టురాలు. నల్లని దేహం మీద పసుపురంగు వస్త్రం అందాన్నిస్తుంది. శరీరమునుండి తులసి పరిమళము వెదజల్లుతూ ఉంటుంది. అట్టి లోక గురువు శ్రీకృష్ణునకు నమస్కరించుచున్నాను.

**7. శ్లో॥ గోపికానాం కుచద్వంద్వ కుంకుమాంకిత వక్షసమ్।**
**శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుమ్॥**

ప్రతిపదార్థం : గోపికానాం = గోప యువతుల యొక్క, కుచద్వంద్వ = రెండు స్తనములయందున్న, కుంకుమ =

# సుభాషితం
## మంచి మాట

శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు

మకరికా పత్ర రచనల చేత, అంకిత = చిహ్నితమైన, వక్షసం = వక్షఃస్థలము గలిగిన, శ్రీనికేతం = లక్ష్మీ నివాసమైన, మహేష్వాసం = గొప్ప విల్లును ధరించిన, జగద్గురుం = లోకాచార్యుడైన, కృష్ణం = కృష్ణుని గూర్చి, వందే = నమస్కరించుచున్నాను.

తాత్పర్యము : శ్రీకృష్ణుడు గోపికలను వివాహమాడినాడు గదా! వాళ్లు తమను చక్కగా అలంకరించుకొని వుంటారు. ఆ అలంకరణలో ఒక పద్ధతి అలంకార శాస్త్రంలో వుంది. కౌగలించుకోవడంలో అద్భుతం జరగాలి. పరస్పర ప్రేమ పుట్టాలి. కామ నాడులు చురుకుగా స్పందించాలి. ప్రేమ పరాకాష్టకు రావాలంటే గాఢాలింగనం సాధనం. ఆ సాధనంలో ప్రియురాలి స్తనములపై మకరికా పత్ర రూపంలో కుంకుమ రాసుకుంటారు. ఆ ముద్ర ప్రియుని చాతిపై పడుతుంది. గోపయువతుల ఆలింగనంలో కృష్ణుని వక్షః స్థలము ప్రకాశించుచున్నది. ఆ వక్షః స్థలము లక్ష్మీ దేవికి నివాసస్థానము. గొప్ప విల్లు గలవాడని కొత్త విషయం ఈ శ్లోకంలో వుంది. కృష్ణునికి ధనుస్సు ఉందా? అంటే వుంది. కృష్ణుడు శ్రీమన్నారాయణుడు. ఇది చెరసాలలో పుట్టినప్పుడు మనకు స్పష్టము.

"తమద్భుతం బాలక మంబుజేక్షణం చతుర్భుజం శంఖ గదాద్యుధాయుధమ్ శ్రీవత్స లక్ష్మం గళ శోభి కౌస్తుభం" అని గదా! వ్యాసభగవానుడు అన్నాడు. కాబట్టి పంచాయుధాలు శ్రీకృష్ణునికి వుంటాయి. అవసరమైనప్పుడు ఆయా ఆయుధాలను ధరించే వాడని మనకు శిశుపాలుని వధ విషయంలో తెలిసినది గదా! అందుకే 'మహేష్వాసం' అనడం సమంజసమే. 8 వ శ్లోకంలో ఇంకా స్పష్టం అవుతుంది చూడండి. (మిగతా 22 వ పేజీలో)






శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్రీమతే రామానుజాయనమః

గృహమును నిర్మించు యజమాని ముందు గృహమును నిర్మించదలచిన గ్రామము, ఆగ్రామము యొక్క అనుకూలతను, ప్రతికూలతను తెలిసికొనవలయును. ఆ తదుపరి తాను నిర్మించదలచిన స్థలము పరిశీలించ వలయును. భూమి యొక్క రంగు, రుచి, వాసన. జాతి, ఎత్తు పల్లములు దిశలు దిక్కులు వాటి హెచ్చుతగ్గులు యివి అనుకూలముగా వున్నవా లేవా? సరిచూసుకొనవలయును. గృహము నిర్మించు యజమాని ధర్మపత్నీల యొక్క నామములు లేదా నక్షత్రముల ప్రకారము ఎంత క్షేత్రము గృహము నిర్మించవచ్చును అనేది తెలిసికొన వలసిన అవసరమున్నది. క్షేత్రము, క్షేత్రార్వణము, ఆయము, వారము, ధనము, అంశ, రుణము, నక్షత్రము, తిథి, యోగము, ఆయుష్యము మొదలగు విషయములను క్షుణ్ణముగా దంపతులకు యోగ్యమగునట్లుగా తెలిసికొని గృహము నిర్మించుకోవలయును.

ప్రతి (జీవుడు) మనుష్యుడు. ఆయుర్దాయము ధనము, ఆరోగ్యము, యశస్సు మొదలగు వాటిని విశేషముగా అనుభవించుటకు తాను కట్టుకోదలచిన గృహము యొక్క క్షేత్రార్వణ పథకములను, వాటి ఫలితములను, తారాబల చంద్రబములను శాస్త్రప్రకారము చక్కగా తెలిసికొని దంపతులకు యోగ్యముగా వృద్ధిగా యుండునట్లు గృహము కట్టుకోవలసి యున్నది.

**చాలా మంది పండితులు గామార్వణము చూచుకోనునపుడు, కొంతమంది నామనక్షత్రము ప్రాధాన్యము, కొంతమంది జన్మనక్షత్రము ప్రాధాన్యముగా తీసుకోగలరు. యింతకు ఏది తీసికోవలయును?**

జ్యోతిర్నిబంధము అనే గ్రంథముల్లో నామనక్షత్రమునకే ప్రాధాన్యత యిచ్చినట్లు ఈ క్రింది శ్లోకము ద్వారా మనకు కనిపిస్తుంది.

**శ్లో॥ దేశే గ్రామే గృహే యుద్ధే సేనాయాం వ్యవహారికే।**
**నామరాశేః ప్రధానత్వం జన్మరాశిం నచింతయేత్॥**

లల్లాచార్యులు అనే మహానుభావుడు కూడా నామ నక్షత్రమునకే ప్రాధాన్యత యిచ్చిన్నట్లు ఈ క్రింది శ్లోకము ద్వారా మనకు అవగతమవుతుంది.

**కాకిణ్యాం వర్గశుద్ధౌచ దానేద్యూతే జ్వరోదయే।**
**మంత్రే పునర్భూవరణే నామరాశేః ప్రధానతా॥**

దేశము, గ్రామము, గృహము. యుద్ధము, ఉద్యోగము, న్యాయవ్యవస్థ, వ్యవహార విషయములు మొదలగు వాటికి సంబంధించిన విషయములకు నామనక్షత్ర నామరాశుల నుండి శుభాశుభములను నిర్ణయించవలయును. జన్మనక్షత్ర జన్మరాశుల నుండి నిర్ణయించకూడదని పై ప్రమాణము ద్వారా తెలియుచున్నది. యిది యేగాక కాకిణి నిర్ణయము. దానము. ద్యూత (జూదము) ఇట్టి విషయముల ఫలములను తెలుసుకొనుటయు, జ్వరము వచ్చిన సమయమును బట్టియు శుభాశుభములను నిర్ణయంచవలసినను. మరియు మంత్రోప దేశము తీసుకొను సమయమున మంత్రోపాసన, పురశ్చరణ ప్రారంభ, మనుజులకు సంబంధించిన విషయములు నిర్ణయించుటకు నామరాశి నామనక్షత్రము ప్రాముఖ్యమైనవి. నామనక్షత్ర, నామరాశుల ననుసరించి శుభాశుభ ఫలములు చూసుకొనవలయును. కాని జన్మనక్షత్ర, జన్మరాశుల ననుసరించి చూడకూడదని ప్రమాణము.

**శ్లో॥ దేశేజ్వరే గ్రామ గృహ ప్రవేశే**
**సేవాసు యుద్ధే వ్యవహారకార్యే ।**
**ద్యూతేషు దానేషు చ నామరాశి:**
**యాత్రా వివాహాదిషు జన్మ రాశిః ॥**

గ్రామార్వణము చూసుకొనునపుడు, గృహనిర్మాణము చేయునపుడు గృహప్రవేశ సమయమందు వారి వారి నామనక్షత్ర, నామరాశుల నుండి ఫలితములను స్వీకరించవలయును. అంతేకాని జన్మనక్షత్ర, జన్మరాసులను లెక్కించి ఫలమును చూడకూడదని పై ప్రమాణములు తెల్పుచున్నవి. (గృహరత్నభూషణం) ★

# శమీ శమయతే పాపం.....






**శమీ శమయతే పాపం। శమీ శత్రు వినాశనం।**
**అర్జునస్య ధనుర్ధారీ। రామస్య ప్రియ దర్శినీ।।**

పాండవులు అరణ్యవాసమునకు వెళ్ళునపుడు తమ దగ్గర ఉన్నటువంటి అస్త్రశస్త్రాదులను శమీ వృక్షమునందు ఉంచి అజ్ఞాతవాసమునకు బయలు దేరారు. అజ్ఞాతవాసము ముగిసిన పిదప తిరిగి మరల శమీ వృక్షమునందు ఉంచిన వారి ఆయుధములను విజయ దశమి రోజున తిరిగి పొందుతారు. ఆ రోజు నుంచి విజయదశమి రోజున ఆయుధ పూజ మరియు శమీ వృక్ష పూజ నిర్వహించుట సంప్రదాయంగా వచ్చింది. ఈ పూజ వలన ఇహ జన్మలో పాపములు ప్రక్షాళన గావించబడతాయి.



అలాగే విజయదశమి రోజున శమీ వృక్ష పూజ నిర్వహించి శమీ పత్రమును శిరమున ధరించుట వలన శత్రు వినాశనం జరుగుతుంది అని పురాణోక్తి. దేవతా నివాసమైన వృక్షములను మొక్కలను పూజించుట భారతీయ సంస్కృతి. శమీ వృక్ష పూజ తర్వాత ఆ పత్రమును బంగారం తో సమానంగా భక్తితో పరస్పరం ఇచ్చుకొని పెద్దల ఆశీస్సులు అందుకోవడం తెలుగు నాట ఆచారంగా ఉంది. సకల జనుల క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రతి గ్రామంలోనూ నిలయమైన దేవతా మూర్తికి ఉత్సవ, ఆరాధనలు జరిపి శమీ వృక్ష పూజ చేయడం సంప్రదాయంగా వస్తున్నది.





తెలంగాణ రాష్ట్రంలో సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన నవనారసింహ క్షేత్రం ధర్మపురిలో పూర్వం నుండి ఈ విజయదశమి (దసరా) ఉత్సవాన్ని అత్యంత వైభవంతో నిర్వహిస్తున్నారు. శ్రీ ధర్మపురి యందు శ్రీలక్ష్మీ నరసింహుడు యోగ, ఉగ్ర రూపములలో కొలువై భక్తుల కోరికలను తీర్చుటకు అవతరించి ఉన్నారు. ఇలాంటి క్షేత్రంలో శరన్నవ రాత్రులు అత్యంత వైభవంగా నిర్వహింప బడతాయి. ప్రతిరోజు స్వామి వారు వివిధ వాహనా రూఢుడై గ్రామ పురవీధుల గుండా విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యమును ప్రసాదిస్తాడు.

**(మిగతా 23 వ పేజీలో)**

# భాగవతశ్రీపాదసంబంధవైభవమ్



శ్రీమాన్ శ్రీ డాక్టర్ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

శ్రీవిష్ణుపురాణ భాగవతాది పురాణాలలో వర్ణింపబడిన గజేంద్రమోక్ష వృత్తాంతం సుప్రసిద్ధమైనది. ఈ వృత్తాంతంలో సూక్ష్మంగా భాసించే ఒక విషయాన్ని ఇప్పుడు అనుసంధించుకుందాం.

భగవద్భక్తుడైన ఇంద్రద్యుమ్నుడు అనే ప్రభువు అగస్త్య మహాముని ఇచ్చిన శాపవశంచేత గజేంద్రుడుగా మారిపోయాడు. రూపం మారినప్పటికీ, పూర్వ కృత పుణ్యవశంచేత అతనికి గల భగవద్భక్తి పోలేదు. ప్రతి దినం కొలనులో పూచే తామర పూలను కోసి, భగవంతుని పాద సన్నిధిలో సమర్పించేవాడు. ఆ క్రమంలోనే ఒకనాడు అతడు ఒక సరస్సులో పూచిన తామర పువ్వును చూచి, దానిని కోయడంకోసం ఆ కొలనులోకి దిగాడు. అందులో ఉండే ఒక మొసలి ఆ గజేంద్రుని కాలును పట్టుకున్నది. హూహూ అనే గంధర్వుడు దేవలమహర్షి శాప వశం చేత ఆ మొసలి రూపాన్ని పొందాడు.

**భగవత్సంబంధం కంటే, భాగవత సంబంధం, ఆచార్య సంబంధం అనేవి మోక్ష సిద్ధికి కారణాలు. భగవద్భక్తుని సంబంధం వ్యతిరేక క్రమంలో కలిగితేనే ఇంతటి గొప్ప ఫలం సిద్ధించినప్పుడు, ఇక, అనుకూలమైన భావనతో భగవద్భక్తుని ఆరాధిస్తే, ఎంతటి గొప్ప ప్రయోజనం సిద్ధిస్తుందో!**

గజేంద్రుడు మొసలి నోటినుండి బయటపడడం కోసం చాలా కాలం ప్రయత్నం చేశాడు. కానీ, ఆ పని అతనికి సాధ్యం కాలేదు. క్రమంగా మొసలి బలం పెరిగింది, గజేంద్రుని బలం తగ్గింది. తనను రక్షించుకునే శక్తి తనకు లేదని తెలిసిన తరువాత గజేంద్రుడు భగవంతుని రక్షించమని ప్రార్థించి, శరణాగతి చేశాడు. తన ప్రాణాలు పోయేలోగానే తాను కోసిన తామర పూవును భగవంతుని పాద సన్నిధిలో సమర్పించ గలిగే అదృష్టాన్ని తనకు కలిగించి, తాను చేసే కైంకర్యాన్ని స్వీకరించమని భగవంతుని ప్రార్థించాడు.


గజేంద్రుని ప్రార్థనను ఆలకించిన భగవంతుడు తత్తర పాటుతో చాలా వేగంగా సరస్సు తీరానికి వచ్చి, సుదర్శన చక్రాన్ని ప్రయోగించి, మొసలి కంఠాన్ని ఖండించి, గజేంద్రుని రక్షించాడు. మొసలి కూడా శాపవిమోచనాన్ని పొంది, నిజరూపాన్ని పొంది, మోక్షాన్ని పొందింది. గజేంద్రుడు భగవంతుని పాదసన్నిధిలో తాను కోసిన తామర పూవును సమర్పించాడు. ఆ తరువాత అతడు కూడా శాపవిమోచనాన్ని పొంది, మోక్షాన్ని పొందాడు. ఈ కథ అందరికీ తెలిసినదే.

ఇందులో గమనించదగిన ఒక అర్థం ఉన్నది. భగవత్సంబంధం కంటే, భాగవత సంబంధం, ఆచార్య సంబంధం అనేవి వేగంగా మోక్ష సిద్ధికి కారణాలు అనేది సంప్రదాయికమైన అర్థం. భగవంతునకు తనను భజించే భక్తుని విషయంలో కంటే, తన భక్తుని సేవించే భక్తుని విషయంలో ప్రీతి అధికంగా ఉంటుంది. “మే భక్తభక్తభక్తేషు ప్రీతి రభ్యధికా భవేత్” అని భగవంతుడే ఈ విషయాన్ని స్వయంగా చెప్పాడు. గజేంద్రుడు భగవంతుని పాదాలను ఆరాధించాడు. అయినప్పటికీ, అతనికి ముక్తి ముందుగా కలుగలేదు. ప్రతికూలమైన భావనతో పొందినా, మొసలి భగవద్భక్తుడైన గజేంద్రుని పాద సంబంధాన్ని పొందింది. గజేంద్రుని కాలిని అది నోటితో పట్టుకున్నది కదా. ఆ విధంగా దానికి కలిగిన భాగవత సంబంధం కారణంగా మొసలికే ముందుగా మోక్షం లభించింది. భగవత్పాద సంబంధం ఉన్నప్పటికీ, గజేంద్రునకు ఆ తరువాతనే మోక్షం సిద్ధించింది. ఇది భాగవత శ్రీపాద సంబంధ మహిమను వ్యక్తం చేస్తున్నది.

భగవద్భక్తుని సంబంధం వ్యతిరేక క్రమంలో కలిగితేనే ఇంతటి గొప్ప ఫలం సిద్ధించినప్పుడు, ఇక, అనుకూలమైన భావనతో భగవద్భక్తుని ఆరాధిస్తే, ఎంతటి గొప్ప ప్రయోజనం సిద్ధిస్తుందో చెప్పనక్కరలేదు. ★

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) **వర్ణ వాస్తు**

గృహ స్థలము 9 భాగములుగా ఏర్పరిచి ఒక్కో భాగము ఒక్కో గ్రహ స్థానముగా నిర్ణయించాలి. ఆయా స్థానములు, ఆయా గ్రహము, ఆయా వర్ణముగల మట్టిని సేకరించవలెను. పోసిన మట్టి కుంగ కుండా సగం మట్టి సగం ఇసుక కలిపి నింపుతారు. గ్రహ వర్ణ మట్టి తూర్పు శుక్ర స్థానం తెలుపు మట్టి ఇసుక, ఆగ్నేయం చంద్ర స్థానం లేత పసుపు మట్టి ఇసుక, దక్షిణ కుజ స్థానం ఎరుపు మట్టిలో ఇసుక, నైరుతి రాహు స్థానం బూడిద వన్నె మట్టి లో కూడిన ఇసుక, పశ్చిమం శని స్థానం నలుపు మట్టి లో కూడిన ఇసుక, వాయువ్యం కేతు స్థానం రంగు రంగు రాళ్లతో కలిపిన ఇసుక, ఉత్తరం గురు స్థానం స్వర్ణ వర్ణంలో మెరిసే మొరం (మట్టితో) కూడిన ఇసుక, ఈశాన్యం బుధ స్థానం కేవలం ఇసుక, మధ్య రవి స్థానం లేత గులాబీ వర్ణంలో కూడిన మట్టి ఇసుక కలిపి నింపడం ద్వారా ఏ రాశి జాతకులు ఆ గృహంలో నివసించినప్పటికీ అందరికీ సమగ్ర శుభ ఫలితములు అందుతాయని వర్ణ వాస్తు నిర్ణయం.

స్థల ప్రభావం పోసిన ఈ మట్టిని 2 సంవత్సరములకు ఒక

| | | |
|---|---|---|
| బుధ<br>కేవలం ఇసుక | శుక్ర<br>తెలుపు | చంద్ర<br>లేత పసుపు |
| గురు<br>మెరిసే మట్టి | రవి<br>గులాబి | కుజ<br>ఎరుపు |
| కేతు<br>రంగు రాళ్లు | శని<br>నలుపు | రాహు<br>బూడిదరంగు |

అంగుళం చొప్పున కలుషితం చేస్తుంది. ఉదాహరణ: 36 అంగుళముల మట్టి పోస్తే 72 సంవత్సరముల వరకు మట్టి కలుషితం అవుతుంది. అందుకే మన ప్రాచీనులు నిర్మాణములో బరంతి మట్టి పోయు విషయమునకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిరి. ప్రతి అంగుళం మట్టికి 2 సంవత్సరముల కాలమును గుణించాలి. ఎన్ని అంగుళముల మట్టి ఎన్ని సంవత్సరములు అని గణన చేస్తారు.


ఈ పునాది నుండి రంగుల ప్రాధాన్యత ప్రారంభించి, నిర్మాణము పూర్తియగు వరకు ఈ రంగుల వర్ణ వాస్తు ప్రాముఖ్యతను పాటించినారు.

ఉదాహరణ: పునాది, బేస్మెంట్ నిర్మాణాలలో ఉపయోగించే శిలలు కూడా ఆయా దిశలలో ఆయా రంగు శిలలను ఒక్కటైనా పెట్టేవారు. ప్రాచీన నిర్మాణములను గమనిస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. అలాగే గోడల నిర్మాణములలో ఆయా దిశలలో ఆయా రంగులలో ఒక్కటైనా ఉపయోగిస్తారు. చివర గృహ నిర్మాణం పూర్తి అయిన పిదప ఆ గృహానికి రంగులు వేసే సమయంలో ఈ గ్రహముల దిశల రంగులు వేయడం శాస్త్రనిర్ణయం.

ఈ — తూ — ఆ (ఉ ఎడమ, ద కుడి; వా — ప — నై)

| | | |
|---|---|---|
| పచ్చ | వజ్రం | ముత్యము |
| పుష్యరాగం | కెంపు | పగడం |
| వైఢూర్యం | నీలం | గోమేధికం |

అలాగే ఈనాటి ఆధునిక నిర్మాణములో ఇనుము, సిమెంటు ప్రాధాన్యత సంతరించుకున్నది కదా! **(మిగతా 22 వ పేజీలో)**



# సందేహాలు - సమాధానాలు

**నిత్యజీవితంలో ఎదురయ్యే జ్యోతిష్య, ఆధ్యాత్మిక, శాస్త్ర సంబంధమైన ధార్మిక సందేహాల నివృత్తికై శ్రీసన్నిధానం వేదికగా ఆయా పండితుల ద్వారా సమాధానాలు తెలుసుకోవచ్చు. ఇది పాఠకుల కోసం సరికొత్త శీర్షిక!. ఈ నెల పాఠకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు.**

★ ప్రశ్న: **నేను ఏ పని చేసినా అదృష్టం కలిసి రావట్లేదు. పరిష్కారం చెప్పండి?**

రాజేంద్రప్రసాద్, కొడిమ్యాల, జగిత్యాల జిల్లా

★ జవాబు : **శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

మీరు అడిగిన ప్రశ్నలో మీ జాతక వివరాలు లేవు. ఇప్పుడు బృహస్పతి మంచి స్థానంలో వున్నాడు. ఆదిత్య హృదయం నిత్యం పఠించండి. మరియు గాయత్రి రామాయణాన్ని చదవండి. అన్ని అనుకూలమై మీరు అనుకొన్న పనులు నెరవేరి అన్ని శుభాలు కలుగుతాయి.

★ ప్రశ్న: **పురుష కారము అంటే ఏమిటి ?**

**యస్.యస్.జి. మూర్తి, కరీంనగర్**

★ జవాబు : **శ్రీమాన్ శ్రీ కండ్లకుంట వెంకటనర్సింహాచార్యులు**

పురుష కారము అంటే ఒక మనుషుడు చేసేటువంటి ఉపకారము, ప్రయత్నము. మానుష్యులు ఐనవారు ఎదుటివానియొక్క దుఃఖాన్ని చూడలేక వాడికి తగిన ఉపకారము, సహకారము చేయటమే. వారి ప్రయత్నం ఫలించేటట్లు చెయ్యడం. తన శాయ శక్తుల ప్రయత్నించడం. అయితే ఇది వాడు కోరితే చేయవచ్చును, కోరుకున్నా కూడా అతనియొక్క అవస్థను గమనించి సహాయము చేయవచ్చును. విభీషణుడు శరణాగతి చేసినప్పుడు హనుమంతుడు పురుష కారము చేసినాడు. అట్లాగే రావణాసురిడి దగ్గర ఈ హనుమంతుడిని చంపివేయండి అని ఆజ్ఞాపించినప్పుడు దూతను చంపడం తగదు వేరే శిక్షలు వెయ్యాలి, ప్రాణం తీయవద్దు అని విభీషణుడు రావణాసురునికి సూచించినాడు. రాజధర్మంగా సూచించినాడు. దాని వల్ల హనుమంతుడు బయటపడినాడు.

లక్ష్మీ దేవి కూడా జీవుల విషయంలో పరమాత్మ వద్ద పురుష కారము చేస్తుంది. ఆ విధంగా స్వతంత్రుడైన పరమాత్మ యొక్క నిరంకుశ స్వాతంత్ర్యాన్ని తగ్గించి జీవులకు ముక్తిని అందించడంలో సహాయం చేస్తుంది. ఉదాహరణ : కాకాసురుడికి ప్రాణభిక్ష పెట్టించింది కదా! ఘోరమైన అపకారం చేసిన కాకాసురునికి ప్రాణభిక్ష పెట్టించింది. ఎట్లాగా? వాడు వచ్చి శ్రీరాముడివైపు కాళ్ళను వుంచి తలను వ్యతిరేక దిశగా పెట్టి పడిపోయినాడు. అది అపచారామె కదా? అపచారమే అతనికి మరింత కోపాన్ని తెప్పిస్తుంది. కానీ సీత దేవి అక్కడవున్న ఒక కట్టెపుల్లను తీసుకొని వాడి తలను రాముని పాదాలవైపుకు తిప్పింది. దానితో 'చావు తప్పి కన్ను లొట్టపోయి' ప్రాణాలతో బయటపడినాడు. ఈ సామెత ఈ వృతాంతం మీదనే వచ్చింది. ఆ విధంగా పురుషుడుగా చేయవలసిన ప్రయత్నాన్ని పురుష కారము అని అంటున్నాము.

ముక్తుల విషయంలో లక్ష్మీ దేవి చెప్తుంది. సీతా దేవి కాకాసురుని విషయంలో పురుష కారము చేసింది. విభీషణుని విషయంలో హనుమంతుడు చేసినాడు. హనుమంతుని విషయంలో విభీషణుడు పురుష కారము చేసినవాడు అయినాడు. చిట్టచివరగా రావణ వధ అనంతరము రాక్షస స్త్రీల విషయంలో సీతాదేవి గొప్ప పురుష కారాన్ని చేసింది. హనుమంతుడు సీతాదేవిని బాధపెట్టిన రాక్షస స్త్రీలను చంపడానికి, హింసించడానికి సీతాదేవి యొక్క అనుమతిని కోరినప్పుడు " పాపానాం వా శుభానాం వా వధార్హాణామ్ ప్లవంగమ। కార్యం కరుణమార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి॥" అని చెప్పి హనుమంతుడిని నివారించింది. రాక్షస స్త్రీలను కాపాడింది. వాళ్ళు సాపరాధులు. సీత విషయంలో అపరాధం చేశారు కదా! అయినా గొప్ప మనసుతో వాళ్ళను హనుమంతుని నుండి కాపాడింది. ఇది పురుష కారం. ★



# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

సేకరణ: డింగరి శ్రీనివాసమూర్తి

బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ. 'బతుకమ్మ' పండుగను తెలంగాణా రాష్ట్రంలో భాద్రపద అమావాస్య లేదా ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. రంగు రంగుల పూలను పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటిలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు కనిపిస్తాయి. ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయళ్లలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నంది వర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు కూడా ఈ సమయంలో ఒక పెద్ద ఆకర్షణ. ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.



**తొమ్మిది రోజుల బతుకమ్మ**

ఎంగిలి పూల బతుకమ్మ: మహా అమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

అటుకుల బతుకమ్మ : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

ముద్దపప్పు బతుకమ్మ : ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

నానే బియ్యం బతుకమ్మ : నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

అట్ల బతుకమ్మ : అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

అలిగిన బతుకమ్మ : ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.

వేపకాయల బతుకమ్మ : బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.


వెన్నముద్దల బతుకమ్మ : నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

సద్దుల బతుకమ్మ : ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదురకాల నైవేద్యాలు తయారు చేస్తారు.

పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు. ఈ తొమ్మిది రోజులలో వీరు రోజూ బతుకమ్మలు చేసి, ప్రతీ సాయంత్రం వాని చుట్టూ తిరుగుతూ ఆడుతారు. ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు. చివరి రోజు బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) పండుగ అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్ళలోనికి పోయి తంగేడు, గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకుని వస్తారు. ఆ తరువాత ఇంటిల్లిపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగు పూలు, తంగెడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. ఈ పూలను జాగ్రత్తగా ఒక పళ్ళెంలో వలయాకారంగా, రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. (మిగతా 17 వ పేజీలో)

# భాగవతంలో భగవంతుని

# అవతార గాథలు



**శ్రీమతి తిరుమల నీరజ**

(క్రిందటి సంచిక తరువాయి)

ఆ ఆదివరాహం అడ్డు లేకుండా వీరవిహారం చేస్తూ, కొంత సేపు తన మోరతో కులపర్వతాలను ముక్కలయ్యే విధంగా చిమ్మసాగింది. కొంత సేపు బ్రహ్మాండభాండం పగిలి రంధ్రాలు పడేటట్లు కొమ్ములతో కోరాడుతూ, మరి కొంత సేపు సప్తసముద్రాలూ రొచ్చుగుంటలై ఎండిపోయే విధంగా తన కాలిగిట్టలతో మట్టిలో ఆడుకొంటూ ఉంది. ఇంకా కొంత సేపు సూర్యచంద్రు లిద్దరూ ఒకే మూలకు పోయేటట్లుగా తన పొట్టి తోకను తిప్పుతూ కులుకుతూ, దూకుతూ, దాటుతూ, విజృంభించి ఎగురుతూ, భూమిని తవ్వుతూ పెద్ద పెద్ద కన్నాలు పెడుతూ, తన ఘనతను ప్రదర్శిస్తూ ఆ విధంగా చెలరేగి పోయింది. అదంతా చూస్తున్న దానవరాజు హిరణ్యాక్షుని గుండె తల్లడిల్లిపోయింది.



నేత్రాల నుండి నిప్పులు రాలుస్తూ పదు నైన కోరల చివర ఇలాతలాన్ని మోస్తూ తనకు ఎదురువస్తున్న ఆ వరాహాన్ని చూసి, అడవులలో సంచరించే ఈ మృగం ఈ నీటిలో ఇంత స్వేచ్ఛగా ఎట్లా తిరగ గలుగుతూంది? అని హిరణ్యాక్షుని మనసులో ఆశ్చర్యమూ, భయమూ పెరిగాయి. అతడు భీకరసూకరరూపంతో తిరుగుతున్న ఆ మహావిష్ణువుతో ఇలా అన్నాడు "తెలివి లేని ఓ సూకరమా! విధాత నాకిచ్చిన వరాలను బట్టి, రసాతలం లోని ఈ భూమండల మంతా ఎప్పుడూ నా స్వాధీనంలో ఉంటుంది. నీవు ఈ ధరణిని ఎత్తుకొనిపోయే ప్రయత్నం చేయకు! వదిలెయ్యి. లేదూ తీసుకొనేపోతాను అంటావా... నేను నిన్ను సంహరిస్తాను, నా మాటలు లక్ష్యం చేయకుండా అనవసరంగా ప్రాణాలెందుకు కోల్పోతావు? మాయావివైపోయి ఈ భూమిని నీవెత్తుకొని పోతూఉంటే నా శౌర్యంతో నిన్ను అణచి పారేయకుండా చూస్తూ ఊరుకొంటానా? యోగమాయాబలంతో ఈ కాస్త పౌరుషంతో సంతోషిస్తున్న నిన్ను, ఇప్పుడే ఇక్కడే పాతిపెట్టేసి, నా స్నేహితులకు, సేవకులకు ఆనందం చేకూరుస్తాను. నా గదా దెబ్బతో తల బద్దలైన నిన్ను తిలకించి సురగణాలందరూ మొదళ్లు నరకివేసిన వృక్షాల వలె నశిస్తారు."

ఈ విధంగా దానవరాజు అనేటప్పటికి, యజ్ఞవరాహ రూపంలో ఉన్న శ్రీహరి, బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన వారందరికీ పట్టబోయే దురవస్థకు లోలోపలే చింతించాడు. తత్ క్షణమే వాడి ఐన తన కోరల చివరలో వర్ధిల్లుతున్న ధరణీదేవితో పాటు అతికోపంతో బయటికి వచ్చాడు. స్వామికి వచ్చిన కోపం అసురేంద్రుని మాటలనే అంకుశాల పోట్లకు. ఆ విధంగా బయటికి వచ్చిన స్వామి, భీతిల్లిన కరిణితో కూడిన మదగజేంద్రుని వలె భాసించాడు.

తన పదునైన ధవళదంతకాంతులు ఆకాశమండల మంతా వ్యాపిస్తూ ఉండగా, సముద్రం నుండి వెలికి వచ్చాడు వరాహస్వామి. మద మాతంగాన్ని వెంబడించే మకరం వలె శ్రీమహావిష్ణువును వెంబడించాడు హిరణ్యాక్షుడు. ఆ శ్రీహరితో ఈ విధంగా అన్నాడు – "ఎంతగా నిందించినా నీకు రోత కలగడం లేదు. మోసంతో యుద్ధంలో గెలవాలని అనుకొన్నావు. ఇప్పుడు పిరికివాడివై పారిపోవటమే మేలనుకొంటున్నావా?"

ఇట్లా తనను ఆక్షేపిస్తే స్వామి మనసు కోపంతో నిండిపోయింది. వెంటనే అనాయాసంగా నీటి పైన భూమిని హరి తన బలప్రభావాలతో నిలబెట్టాడు. అది చూసి దేవతలు ఆనందించారు. ఆకాశం నుండి విరుల వాన కురిసింది. దేవదుందుభులు మోగాయి. గంధర్వులు గానం చేయగా, అచ్చరస్త్రీలు నాట్యం చేశారు. **(మిగతా 17 వ పేజీలో)**

**భాగవతంలో భగవంతుని**

# అవతార గాథలు

( 16 వ పేజీ తరువాయి )

అప్పుడు యజ్ఞవరాహమూర్తి ఐన ఆ పరమాత్మ బంగారు కుండలాలు, కంఠంలోని హారాలు, భుజకీర్తులు, కడియాలు, ఉంగరాలు తదితర అలంకారాల కాంతులు గగనవీథులలో ప్రసరించగా, యుద్ధానికి సన్నద్ధ మయ్యాడు.

ఘనమైన గదను చేత పట్టి, సరికొత్తది, విచిత్రంగా గోచరిస్తున్న స్వర్ణకవచం ధరించిన శ్రీమన్నారాయణుడు, తేరి చూడటానికి వీలు లేని ఆగ్రహరూపంతో దానవుణ్ని చూసి నవ్వుతూ, "ఓరీ! అశుభకార్యాలు చేసే నీచుడా! విను! గర్వంతో నన్ను నీవు అడవిలో తిరిగే జంతువు ననుకొంటున్నావు. నేను వన్యమృగాన్నే. మదించి వచ్చే నీ వంటి శునకాలను సమరంలో సంహరిస్తాను. ఓ దురాత్ముడా! నీకు బలం ఉంటే నన్ను యుద్ధంలో ఎదిరించటానికి సిద్ధం కా! నేటితో నీ కోరికలన్నీ తీరిపోతాయి. ఊరికే నిన్ను నీవు ప్రశంసించుకోవటం తగని పని. ఓ దైత్యకులానికి చెందిన అధముడా! విను! విజ్ఞులు సమరాలలో మరణించబోతూ కూడా నీ వలె ఆత్మస్తుతి చేసుకొనరు. వ్యర్థంగా ఎందు కీ స్తోత్రపాఠాలు? ఇది వీరుని లక్షణం కాదు.

"పాతాళంలోని నీ నిక్షేపాన్ని నేను గర్వంతో మించి తీసుకొంటాను. ఓరీ అసురుడా! నన్ను లజ్జ లేనివా డనుకొంటున్నావు. నేను దాక్కొని నీతో యుద్ధం చేస్తానని, నీవు గద తిప్పితే నేను జడిసి పారిపోతానని భావిస్తున్నావా? నీ కోరిక లన్నిటినీ తీరుస్తాను రా! శూరుడివై నన్ను ఈ రణభూమిలో ఎదుర్కొంటే నీ బలాన్ని, ఆయువును నీవు చూస్తుండగానే తీసుకొంటాను. ఇక ఇప్పటి నుండి ఈ భూమండలం మీద దైత్యులు అనేవారు లేకుండా చేస్తాను.

"నన్ను ఎదుర్కొనగలిగిన గొప్ప ధైర్యం, శౌర్యం, బలం ఉంటే రణభూమిలో నిలబడు! లేదా నీ హితుల కళ్లలో కన్నీరు రాకుండా ఉండాలంటే, ఓ దానవకులాధమా! వెంటనే ఇక్కడి నుండి వేగంగా వెళ్లిపోయి ప్రాణాలు కాపాడుకో! వట్టి మాటల వల్ల ఏ ప్రయోజనమూ సిద్ధించదు. నన్ను ఇక్కడే పాతిపెడతా నన్నావు. నీవంతటివాడివే! నీకు ఎంతో ప్రియమైన చుట్టాలు ఎవరైనా ఉంటే వెళ్లి ఒకసారి చూసి రా! ఆ తర్వాత వెంటనే యమపురిలో కాపురం పెడుదువుగాని!" అని తనను హేళన చేసిన హిరణ్యాక్షుని మాటలను అనుకరిస్తూ అన్నాడు.

ఆ మాటలు విన్న హిరణ్యాక్షుడు ఉలిక్కిపడ్డాడు. రోషం, గర్వం మనసులో నిండగా అతడి కనుగుడ్లు ముందుకు వచ్చాయి. కోపంతో తోక తొక్కిన త్రాచులా అయి, మనసులో కీడును శంకించాడు. అతని ఇంద్రియాలన్నీ చలించిపోయాయి. నిట్టూర్పులు పెరిగిపోగా, బొమముడితో, సాహసంతో జలజాక్షునికి ఎదురు వెళ్లాడు. **(సశేషం)**




# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

**(15 వ పేజీ తరువాయి)** ముందుగా తంగెడు ఆకులు, పూలు పేర్చుతారు. ఆపై తంగేడు పూల కట్టలు పేర్చుతారు. మధ్య మధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు.

ఈ అమరిక ఎంత పెద్దదిగా ఉంటే అంత అందంగా ఉంటుంది. తెల్లని గునుక పూలను రంగులతో అద్ది పెడతారు. పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరి మాతను పెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను గృహంలోని దైవస్థానంలో అమర్చి దీపాలతో, అగరొత్తులతో అలంకరించి పూజిస్తారు. సాయంకాలం అందరూ తమ తమ బతకమ్మలతో ఒక చోట చేరి వాటిని మధ్యలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరి దేవిని కీర్తిస్తూ ఆడవారు పాడుతారు. ఆడవారు వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను ధరించి కొత్త బట్టలు కట్టుకుంటారు. ఇలా చాలా సేపు ఆడాక మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు.

ప్రతి సంవత్సరం ఈ పండుగ రోజు చీకటి పడుతుంది అనగా, స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గానీ, తటాకంవైపు గానీ ఊరేగింపుగా బయలుదేరుతారు. ఈ ఊరేగింపు అందంగా అలంకరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో అత్యంత సుందరంగా, శోభాయమానంగా ఉంటుంది. ఈ ఊరేగింపు కొనసాగినంత సేపూ, జానపద గీతాలతో వీధులు మారుమోగుతాయి. జలాశయం చేరుకున్న తరువాత, మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడుస్తారు. పిండి వంటకాన్ని బంధు మిత్రులకు పంచిపెడతారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులై, అష్టైశ్వర్య వంతులై, పాడిపంటలతో తులతూగాలని మహిళలందరూ పూజిస్తూ, కీర్తిస్తూ బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకుంటారు. ఇది తెలంగాణా పండుగ. ★

# శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము
# అఖిల భువన జన్మ...



**ఉభయ వేదాంత పండిత సభలలో (10-09-2023) "శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము అఖిల భువన జన్మ" విషయాంశ ప్రవచనాన్ని ప్రసంగ వ్యాసంగా యథాతథంగా పాఠకుల కోసం.**

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

నమస్సదసే! నమస్సదసస్పతయే! నమస్సఖీనాం పురోగాణామ్ చక్షుషే! ఉభయ వేదాంత సభలు అంటే శ్రీభాష్యం, భగవద్విషయం వీటికి సంబంధించిన సభలని రూఢి. దాన్ని ఈనాడు సార్థకం చేసుకున్నారు.

**"పురా సూత్రైః వ్యాసః శృతిశతశిరోర్థం గ్రథితవాన్**
**వివవ్రే తం శ్రావ్యం వకుళధరతామేత్య స పునః**
**ఉపావేతౌ గ్రంథౌ ఘటయతు మలం సూక్తిభిరసౌ**
**పునర్జజ్ఞే రామావరజ ఇతి స బ్రహ్మముకురః"**

పూర్వంలో భగవంతుని అంశావతారమైన వేదవ్యాస భగవానుడు వేదాలన్నింటినీ విభాగం చేసి వేదములలో ఉండే **"శృతి శిర"** అనబడే ఉపనిషత్తులలో ఉండే సారాన్ని అంతా కూడా పరబ్రహ్మ ప్రతిపాదకంగా 545 బ్రహ్మసూత్రాలను రచించారు. అంతేకాకుండా **"భారతః పంచమో వేదః"** అని ఐదవ వేదంగా మహాభారతాన్ని కూడా రచించారు. ఆ మహాభారతాన్ని రచిస్తూ **"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"** అన్నారు. ధర్మానికి సంబంధించిన విషయం ఏదైతే భారతంలో ఉందో అదే మిగతా గ్రంథాల్లో ఉంటుంది. ఇందులో లేదు అంటే ఇంకెక్కడా లేదు. అని అట్లా అప్రదృశ్యంగా అందించిన మహానుభావులు. **"సత్యం సత్యం పునః సత్యం ఉద్ధృత్య భుజముచ్యతే వేద శాస్త్రాత్ పరం నాస్తి న దైవం కేశవాత్పరం"** అన్నారు. మూడుసార్లు చేతులెత్తి చెబుతున్నాను అంటారు వ్యాసభగవానులు. వేద శాస్త్రం కంటే మించింది లేదు. కేశవుని కంటే మించిన దైవం లేదు. అని చెప్పిన మహానుభావులు. అంతటి మహిమగల మహానుభావులు వేదవ్యాసులు బ్రహ్మసూత్రాలను రాస్తే అంతటి సామర్థ్యం గల వారి శిష్య పరంపరలోని మహానుభావులు బోధాయనులు, వారి బ్రహ్మసూత్రాలకు వృత్తి అని పేరుతో విపులమైన వ్యాఖ్యానాన్ని అందించారు. **"భుజంగ ఏవ జానాతి భుజంగ చరణౌ సఖే"** అన్నట్లుగా పాము కాళ్లు పాముకే తెలుసన్నట్లుగా మహానుభావులైన వేదవ్యాస భగవానుని హృద్గతాభిప్రాయాన్ని అంతటి సామర్థ్యం గల బోధాయనులవారు గ్రహించారు. ఆ తర్వాత వారి శిష్యులు టంక, గురుదేవ, ద్రవిడ మొదలగు వారంతా టిప్పణి అనబడేటువంటి చిన్న చిన్న వ్యాఖ్యానాలను కూడా వ్రాసి సంగ్రహించారు. శ్రీరామానుజులవారి పూర్వంలో ఉండేటువంటి శ్రీయామున మునులకు ఒక సంకల్పం! ఈ బోధాయన వృత్తి గ్రంథమ్ చాలా విపులంగా ఉంది. ద్రవిడ బృహదేవాదులు రాసింది సంగ్రహంగా ఉంది, అటు విస్తృతము కాకుండా ఇటు సంగ్రహము కాకుండా ఉండే విధంగా ఒక భాష్యం వెలువరిస్తే బాగుండు అని సంకల్పం! అది భగవద్రామానుజులవారి ద్వారా నెరవేర్చుకోవాలని అనుకున్నారు. అటువంటి దృఢ సంకల్పం కలిగి ఉండి వారు శరీరంలో ఉండే సమయంలో అది సిద్ధించకపోతే చరమదేహంలో వారు సూచించారు మూడు వేళ్ళను ముడుస్తూ! భగవద్రామానుజుల వారు అది గ్రహించి శ్రీభాష్యం నేను రాస్తాను అని ప్రతిజ్ఞ చేశారు. అని మనం వింటూ ఉంటాం! ఆ ప్రతిజ్ఞకు అనుగుణంగా వారు ఆసేతు హిమాచలం సంచరించి ఆ బోధాయన వృత్తి గ్రంథాన్ని గ్రహించాలి అని, ఎక్కడో ఉత్తర భారతంలో శారదాపీఠంలో ఉండే ఈ వృత్తి గ్రంథాన్ని అతి కష్టం మీద తమ శిష్యులు, తమ కన్నా గొప్పవారు అయిన కూరత్తాళ్వాన్ చేత దాన్ని గ్రహించి శ్రీభాష్యం రాయటం ప్రారంభం చేశారు.

ఆరకంగా శ్రీభాష్యాన్ని నాలుగు అధ్యాయాలుగా అందించారు. ఒక్కొక్క అధ్యాయంలో నాలుగేసి పాదాలుగా విభజించారు. అటువంటి అద్భుతమైన వ్యాఖ్యాన సరణి భాషకారులది! అందుచేతనే **"కః కృత్స్నం వేత్తి భాష్యార్థం"** అంటారు శ్రుత ప్రకాశకాచార్యులవారు. అంటే సంపూర్ణమైన భాష్యార్థాన్ని ఎవరు గ్రహించగలుగుతారు? ఎందుకు అనగా **"అవిస్తృతా స్సుగంభీరాః రామానుజ మునే ర్గిరః"** అని వాటిని గ్రహించడం సాధ్యం కాదు అన్నారు. వారు సాక్షాత్తుగా నడాదూర్ అమ్మాళ్ అను వాచ్యవరద దేశికుల వారి యొక్క శ్రీసూక్తుల ద్వారా శ్రీభాష్యాన్ని అనేకసార్లు శ్రవణం చేశారు. ఆ శ్రవణం చేసిన విషయాల్ని కొంతలో కొంతైనా స్థిరంగా ఉంచాలని ఉద్దేశ్యం చేత "శ్రుతప్రకాశక"

అనే పేరు చేత వ్యాఖ్యానాన్ని అందించారు. అందిస్తూ వారేమంటారంటే **"తత్ భాష్యం స చ భాష్యకృత్"** అంటే భగవద్ రామానుజుల వారు చెప్పినటువంటిదే భాష్యము భాష్యాన్ని రాసిన వారు సాక్షాత్తు భగవద్రామానుజులే! **"స చ హరిః"** అందులో ప్రతిపాదించిన పరమాత్మనే శ్రీమన్నారాయణుడు! **"సమ్యక్ ప్రసీదంతు నః"** అని నమస్కరించారు.

ఆ విధంగా శ్రీ భాష్యానికి వజ్ర కవచం లాగా ఉండేట్టుగా శ్రుతప్రకాశికా వ్యాఖ్యానాన్ని లక్ష గ్రంథ పరిమితంగా అందించారు. ఆ తర్వాత వారు సత్‌బ్రహ్మచారులైన ఆత్రేయ రామానుజాచార్యుల వారి యొక్క శిష్యులలో ప్రధానులైన వేదాంతదేశకుల వారు ఈ శ్రీభాష్యాన్ని అనేకసార్లు వినీ వినీ **"యతీశ్వర సరస్వతీ రసభరేణ నీతం వయః"** అని అన్నారు నా వయస్సు అంతా రామానుజుల శ్రీభాష్య శ్రీసూక్తుల వలన వచ్చే రస భారం చేత గడిచింది **"నిర్విష్టం యతి సార్వభౌమ వచసామ్ ఆవర్తనైః యవ్వనం"** అని అంతటితో ఊరుకోక ఎంతోమందికి ఆవర్తనం అనగా ప్రవచనం చేశారు. **"త్రింషత్ వారమ్ శ్రావితం శారీరకభాష్యం"** అన్నారు. అనగా దాదాపు 30 సార్లు ఈ శ్రీభాష్య అర్థాన్ని వినిపించారట!

అంతటి మహా మహిమాన్వితమైనది శ్రీభాష్యం. శ్రుత ప్రకాశక వ్యాఖ్యానం. ఈ గ్రంథాలను కాపాడుకోవడం కోసం అలనాడు శ్రీరంగంలో తురుష్కుల దండయాత్ర ఏర్పడ్డ సందర్భంలో సుదర్శన భట్టర్ అనే శ్రుతప్రకాశకాచార్యులు, వేదాంత దేశికులు, పిళ్ళైలోకాచార్యులు అనే మహానుభావులు సాంప్రదాయాన్ని కాపాడుకోవాలని సాక్షాత్ శ్రీరంగనాథ మూలస్వామికి అడ్డుగా గోడ నేర్పాటు చేశారు. ఆ రక్షణలో శ్రుతప్రకాశకాచార్యులు ప్రాణాలను అర్పించారు. ఆ శ్రుత ప్రకాశకాచార్యుల గ్రంథాన్ని కాపాడాలని వేదాంత దేశకులవారు కావేరి ఇసుకలో ఆ గ్రంథాన్ని దాచి, దానిపై తాను పడుకొని నిద్రాహారాలు లేకుండా వారి బారిన పడకుండా కాపాడిన మహానుభావులు. పిళ్ళైలోకాచార్యుల వారు ఉత్సవమూర్తులను అతి కష్టం మీద తిరుమలకు చేర్చే ప్రయత్నం చేశారు.

అంతటి అద్భుత గ్రంథం శ్రీభాష్యం. శ్రీభాష్యాన్ని రాస్తూ ప్రారంభంలో వారు ఈ విశేష శ్లోకాన్ని అందించారు.


**అఖిల భువన జన్మ స్థేమ భంగాది లీలే**
**వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే।**
**శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే**
**భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥**

# పుస్తక పరిచయం

## వశిష్ఠ సంహిత

ప్రాచీన ఋషి ప్రోక్త గ్రంథాల్లో శాస్త్ర విషయాలకు సంబంధించి వశిష్ఠ సంహిత ప్రసిద్ధ గ్రంథం ఎన్నో భాషల్లో అనువదింపబడి వ్యాఖ్యానింపబడిన గ్రంథం.

అందులో నుండి 46 అధ్యాయాలుగా తెలుగులో అనువదించి, రచింపబడినది "వశిష్ఠ సంహిత". మోహన్ పబ్లికేషన్స్ రాజమంద్రి నుండి ప్రచురింపబడింది. గ్రంథకర్త ప్రముఖులు జ్యోతిష వాచస్పతి డాక్టర్ ఎం. ఆర్.వి. శర్మ (మారేపల్లి రామ వీరేశ్వర శర్మ ఎం ఎ పి హెచ్ డి గారు) జ్యోతిష్య శాస్త్ర విశేషములతో ఆసక్తిపరులకు చక్కని సమాచారాలను అందించే గ్రంథంగా ఉపయోగపడుతుంది. అరుదైన విశేషము లతో 'శాస్త్రరూపాధ్యాయము' అను ఒకటవ అధ్యాయం నుండి 'రోగోత్పత్తి శాంతి అధ్యాయము' అని పేరు గల 46 వ అధ్యాయం వరకు శ్లోక తాత్పర్య సహితంగా మరియు ఎన్నో జ్యోతిష్య శాస్త్ర సందేహాలను పరిష్కరించే విధంగా రచించబడింది. జ్యోతిష్య గణన పట్టికలతో విస్తారమైన వివరణలతో కూడి ఉన్నది. ఇది ఒక పరిశీలన గ్రంథంగా ప్రాచీన భారతీయ విజ్ఞాన విశేషాలు తెలుపు గ్రంథంగా ప్రచురితమైంది. 425 పేజీలతో అందమైన ముఖచిత్రంతో ముద్రించబడింది.




లభించు ఫోన్ నెంబర్: ఆర్యాపురం రాజమంద్రి సెల్ నెంబర్ 970386712 (గ్రంథ పరిచయమునకు ఆన్లైన్లో పిడిఎఫ్ రూపంలో కూడా లభిస్తుంది)

# శ్రీవైష్ణవ సాంప్రదాయం

## సమాశ్రయణములు



**- శ్రీమత్ తిరుమల పల్లెర్లమూడి వేంకట వీర రాఘవాచార్యులు**

(గత సంచిక తరువాయి) సమాశ్రయణము చేయించుకొనుటకు ముందస్తు షరతులు ఏమిటి?

1.దశరాత్ర జాత-మృత్యు అశౌచము, ఋతుక్రమ మైల మొదలగు అపరిశుద్ధ దినములలో లేని స్త్రీ, పురుషులెవరైననూ అర్హులే. 2.ముందురోజు ఉపవాసము (ఏమియూ భుజించకుండా శుద్ధజలపానము మాత్రమే చేసి) ఉండవలెను. ఎటువంటి కారణమువలననైనా (ఆరోగ్యరీత్యా) అలా ఉండలేకపోతే సంపూర్ణ సాత్విక శాఖాహార ఫలహారము (ఇడ్లి, ఉప్మా, పండ్లు వగైరా) స్వల్పంగా తీసుకొనవచ్చును. 3. నిత్యకర్మలను యథావిధిగా చేయాలి (స్నానం, ఊర్ధ్వ పుండ్ర ధారణ, సంధ్యా వందనం వగైరా), 4. ఆచార్య దర్శనానికి వెళ్ళే సమయాన స్తోమత ఉన్న వారు అవకాశాన్ని బట్టి పూలను, పండ్లను వస్త్రములను (భవానునికి/ ఆచార్యునికి) మరియు సంభావనను తీసుకుని వెళ్లవచ్చు. 5. మరునాడు అనగా సమాశ్రయణము చేయించు కొను రోజున తలస్నానము చేసి, హిందూ సాంప్రదాయ దుస్తులు ధరించాలి.



పురుషులు పెద్దలు సాంప్రదాయ పంచ మరియు ఉత్తరీయం/ కండువా, చిన్న పిల్లలు - సాంప్రదాయ చిన్న పంచ మరియు ఉత్తరీయం / కండువా, స్త్రీలు - సాంప్రదాయ చీర, చిన్న అమ్మాయిలు హిందూ సాంప్రదాయ దుస్తులు. 6. సమాశ్రయణము రోజున ప్రక్రియలు పూర్తయ్యేవరకూ (సుమారు 2 లేదా 3 గంటలు పడుతుంది). సమాశ్రయణం అవ్వాలనుకున్నవారు ఏమియూ తినకూడదు, త్రాగకూడదు. 7. సమాశ్రయణ అనంతరం ఆచార్యుని శ్రీపాద తీర్థాన్ని గ్రహించాలి. ఆ తరువాత ప్రసాదం తీసుకోవచ్చును. 8. ఆచార్యుడు అనుగ్రహించే సూచనలను శ్రద్ధగా శ్రవణం చేయాలి.

సమాశ్రయణానంతరం ఆహార నియమములు ఏమైనా ఉన్నాయా? పంచసంస్కారము అయినవారు పవిత్రమైన ఆలోచనలతో, సాధుస్వభావంతో ఉండాలి. అటువంటి స్వభావానికి హానిని కలిగించే పదార్థాలు, తామస గుణమును ఉద్రేకపరిచే స్వభావం కలిగిన ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయలు, ముల్లంగి, మషాళాలు వంటివి, మరియు అవి వేసిన పదార్థములు భుజింపరాదు.

శ్రీమన్నారాయణునకు నివేదించిన పదార్థములను మాత్రమే భగవత్ ప్రసాదముగా స్వీకరించవలెను. ప్రయాణ సమయాలలో కుదరని పరిస్థితులలో తీసుకునే పదార్థాలపై కొద్దిగా మంచినీటిని సంప్రోక్షించి (చల్లి) ద్వయ మంత్ర సహితముతో మానసికముగా (అంతర్యామిగా ఉన్న) స్వామికి "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు' అని నిశ్శబ్దంగా, మనస్సులోపల నివేదించి మాత్రమే భగవత్ ప్రసాదముగా స్వీకరించవలెను. మంచినీరు లభించకున్నా, లేదా పరిస్థితులు సానుకూలంగా లేకున్నా మానసికముగా (అనగా మనసులో నీటిని చల్లినట్లుగా భావించుకుని ద్వయ మంత్ర సహితముతో మానసికముగా (అంతర్యామిగా ఉన్న) స్వామికి "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు" అని నిశ్శబ్దంగా, మనస్సులోపల నివేదించి మాత్రమే భగవత్ ప్రసాదముగా స్వీకరించవలెను. భగవంతునిపై మనకుగల ప్రేమ, బంధం, ధ్యాసలమీద ఆధారపడి ఇటువంటి ఖచ్చితమైన ఆహార నియమాలు చెప్పబడినాయి. ఎలాగంటే, భూసారము ఏవిధముగా ఆభూమి మనకందించే ఆహార మొక్కలనుబట్టి నిర్ణయించ బడుతుందో ఆ విధముగా మన శరీర సామర్థ్యం దానికి మనమిచ్చే ఆహారాన్ని బట్టి ఉంటుంది. సాత్విక లక్షణాలు కావాలంటే సాత్విక ఆహారమే కదా తప్పనిసరిగా భుజించాలి. మామిడిపండు కావాలంటే మామిడి విత్తనమైన మామిడి టెంకనే కదా నాటాలి. అట్టి నియమానుసారంగా ఉండటం లేదంటే అర్థం తాను సాత్విక లక్షణములు కలిగి ఉండుటకు ఇష్టంలేదని మరియు జీవకోటికంతటికీ అనగా భగవానునికి భక్తునిగానే

పరిగణించనక్కరలేదు అనే కదా! మన మాటలు, భావాల కంటే మన చర్యలే మన ఆలోచనలను ఖచ్చితముగా తెలియజేస్తాయి. అందువలన మనం తీసుకునే ఆహారమే నిజమైన శ్రీవైష్ణవునిగా ఉండటానికి, ప్రతిబింబించటానికి ముఖ్యపాత్ర పోషిస్తుంది. ప్రతీ పనిలో, ప్రతీ జీవరాశిలో, కరుణ, దయలతో సేవాతత్పరతతో సేవ చేయటమే భగవంతునికి చేసే సేవగా పరిగణించ బడుతుంది. మన కడుపు నింపుకోవటంకోసం మూగజీవాలను చంపితినే అధికారం ఎవరిచ్చారు. మాంసభక్షణం మృగచర్యే కానీ మానవత్వం కాదు కదా!. అందువలన మాంసాహారమును భుజించరాదు.

ప్రతిరోజూ పూజ చెయ్యాలా?

సమాశ్రయణం అయినా ప్రతీవారూ ప్రతీరోజూ భగవంతునికి పూజ (తిరువారాధన) చేయాలని చెప్పబడినది. భగవంతుని ఆరాధించే విధివిధానాలెన్నో ఉన్నాయి. భౌతికమైన పూజ చేయుట ఒక్కటి ఏ వ్యక్తినీ శ్రీవైష్ణవునిగా నిర్ధారించదు. తనంతట తానుగా మార్పును కోరుకొని మంచి జ్ఞానము సంపాదించటం, భక్తి, మంచి ఆలోచనలు, మంచి నడవడిక, మంచి పనులు చేయటం ద్వారా స్వయంచాలకంగా తాను చేసే ప్రతీ పనీ ప్రేమతో భగవంతునికి అర్పించినట్లు అవుతుంది. అదే నిజమైన పూజ అవుతుంది. అంటే "స్వయం ఆరాధన", "అందరినీ గౌరవించటం" "జీవకోటికీ సేవ చేయటం ద్వారా భగవంతునికి సేవ చేయటం" అన్నమాట. దైవ చింతనకు సమయంతో పనిలేదు. మనం ఏ పని చేస్తున్నా ఆ పనిలో భగవంతుని చూడగలగాలి.

పంచ సంస్కారములు ఆరంభమా లేదా అంత్యమా?

సమాశ్రయణం సాధారణమైన కర్మయని ఇక్కడితో ఇక చాలని చాలా మంది అపోహ పడుతుంటారు. కాని అది సరైనది కాదు. శ్రీవైష్ణవత్వమునకు ఇదే ఆరంభ ప్రయాణం. పూర్వాచార్యులు అనుగ్రహించిన విశేష లక్ష్యమగు (శ్రీ మహాలక్ష్మితో కూడిన శ్రీమన్నారాయణునికి నిత్య కైంకర్యము చేయుట) ఆచార్యుని ద్వారా తెలుపబడిన భగవానుని అంగీకరించి అతను తెలిపిన నియమాలను పాటించాలి. ఇదే జీవాత్మ ఉజ్జీవించుటకు సహజ స్వరూపం, దీనిని దైనందిన జీవనంలో ఆచరణలో పెట్టాలి.

శ్రీవైష్ణవుని లక్షణములు ఎలా ఉండాలి?

భగవద్రామానుజుల అభిమానమునకు పాత్రభూతులను చేయు శ్రీవైష్ణవ లక్షణములలో కొన్ని......

1. భాగవత సాంగత్యము, సదాచార్య సమాశ్రయణము 2. భగవద్భాగవతాచార్య గుణానుభవము, కైంకర్యము, 3. దివ్యప్రబంధ కాలక్షేపము. దివ్యదేశ సందర్శనం 4. నిత్యం తిరుమంత్రం, ద్వయమంత్ర అర్థానుసంధానము: 5. శ్రీవైష్ణవశాస్త్రముల అధ్యయనము, భాగవత తదీయారాధనము. 6. ఆళ్వారాచార్యుల యందు ప్రేమ, సదాచార్యాభిమానము, పూర్వాచార్య అనుష్ఠానముల అనుసరణ, 7. నిష్కామమైన మనస్సు, లోకకళ్యాణము కొరకై వర్తించుట. 8. భూతదయ, వినయము, వైరాగ్యము, పరగతస్వీకారము మొదలగు ఆత్మ గుణములు 9. ఆహారనియమములు 10. శ్రీమన్నారాయణుని తప్ప దేవతాంతరములను ఆరాధింపకుండుట. (భగవానుని ఆజ్ఞను అనుసరిస్తు ఈ జగత్తులో కొన్ని కార్యములను చేయువారు దేవతాంతరములు. వీరందరికి కూడ భగవానుడే అంతర్యామిగా ఉండి ఈ జగత్తులో కొన్ని కార్యములు చేయుస్తాడు. అంటే వారందరినీ సర్వాంతర్యామి ఐన శ్రీమహావిష్ణువు యొక్క వేరువేరు రూపాలుగా పాత్రలుగానే భావించాలి).

ముగింపు: జ్ఞానము, అనుష్ఠానము గల ఆచార్యులను ఆశ్రయించి, కైంకర్యపరులైన వారికి పరమాత్మ తానే వైకుంఠాన్నిస్తాడని ఉపదేశ రత్నమాల లో చెప్పబడినది. ఆచార్యులు మనపై ఎప్పుడూ అభిమానంతోటే ఉంటారు. మనకు భగవదనుగ్రహము కలుగుతున్నది అనడానికి గుర్తు ఆచార్యులపై మనకు అభిమానము పెరగడం..

సమాశ్రయణం ద్వారా మనకు మన ఆచార్యులతో ఆచార్య సంబంధము స్థాపితం అయినట్లే. సమాశ్రయణము చేయించుకున్న తరువాత, మన ప్రవర్తన తమ ముఖవికాసమునకే అని గ్రహించి ఆ ప్రకారముగా మెలగాలి. ఆచార్య సమాశ్రయణ మైన తరువాత వారిలో మానవీయత ఇత్యాది దోషాలు మనకు కనబడితే, అది మన దోషము. ఆచార్య అపచారాలు చేయు వారితో సంబంధము కల్గి యుండడం కాని, అట్టి విషయములను శ్రవణాదులు చేయుట గాని త్యాజ్యములు (త్యజింపతగినవి). మన సంప్రదాయములో ఆచార్యాభిమానము చాలా గొప్పది. ఆచార్యుడు గల వాడే పరమాత్మను తెలియగలడని ఉపనిషత్ ప్రోక్తము. మన ఆధ్యాత్మిక, లౌకిక పరమైన సంశయ, సమస్య లన్నిటినీ మన ఆచార్యులు తీర్చగలరని దృఢవిశ్వాసము కల్గి యుండాలి.

(సమాశ్రయణములకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానముగా నేను తెలుసుకున్న విషయాలకు తోడుగా మరింత వివరముగా అంతర్జాలములో శోధించి విషయాలను సమీకరించి క్రోడీకరించి అందరికి ఉపయోగపడాలని వ్రాసినది ఈ వ్యాసము. శ్రీమత్ తిరుమల పల్లెర్లమూడి వేంకట వీర రాఘవాచార్యులు) ★

# శ్రీపతి స్తుతి సుభాషితం

(9 వ పేజీ తరువాయి)

**8.శ్లో॥ శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితమ్।**
**శంఖ చక్ర ధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

ప్రతి పదార్థం: శ్రీవత్సాంకం = శ్రీవత్సం అనే పుట్టుమచ్చ గుర్తుగా గలగియున్న, మహోరస్కం = విశాలమైన వక్షఃస్థలము గలిగిన, వనమాలా విరాజితమ్ = వనమాలచే ప్రకాశించుచున్న, శంఖచక్రధరం = శంఖము, చక్రము ధరించిన, దేవం = ప్రకాశించు చున్నట్టి, జగద్గురుం = లోకాచార్యుడైన, కృష్ణం = కృష్ణుని గూర్చి, వందే = నమస్కరించుచున్నాను.

తాత్పర్యము: శ్రీకృష్ణుని వక్షఃస్థల సౌందర్యం ఈ శ్లోకంలో వర్ణింపబడుచున్నది. శ్రీకృష్ణుడు అంటే సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడే! 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్.' మిగతా అవతారాలన్నింటిలో కొన్ని అంశావతారాలు, ఆవేశావతారాలు. ఆయా కాలంలో జరిగిన అసౌకర్యాలను తొలగించుటకు వచ్చిన అవతారాలు. ఇకపోతే పూర్ణావతారం శ్రీ రామావతారం. ఐతే అందులో 'యో దివ్యోపి ఆత్మని నరాభిమాని' రాముడు దేవుడే ఐనా తన విషయంలో స్వయంగా తాను నరుణ్ణి అనుకున్నాడు. కాని కృష్ణావతారం అటువంటిది గాదు. 'స్వయం భగవాన్' తనను తాను భగవానుణ్ణి అని పుట్టగానే చెర సాలలో తల్లిదండ్రులకు 'చతుర్భుజం శంఖ గదాద్యుదాయుధం శ్రీవత్స లక్ష్మం గళ శోభి కౌస్తుభం పీతాంబరం సాంద్ర పయోద సౌభగమ్.' అని 4 చేతులు శంఖ చక్రాది ఆయుధాలు, శ్రీవత్సమనే పుట్టుమచ్చ, కౌస్తుభమనే మణి, పీతాంబరం, నల్లని మేఘ వర్ణం అంటూ దివ్యాంబరాభరణ భూషితుడై సాక్షాత్కరించినాడు. అంతే కాక అనేక సందర్భాలలో విశ్వరూపాన్ని చూపాడు. చక్ర ప్రయోగం చేశాడు. 'మద్యాజీ మాం నమస్కురు' అంటూ తననే అర్చించుమని, తనకే నమస్కారం చేయుమని 'భగవానువాచ' అంటూ 18 అధ్యాయాల గీతోపదేశం చేసిన కృష్ణావతారం పరిపూర్ణావతారము.

చివరికి 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అని శరణాగతిని భోధించిన పరాత్పరుడు. అందుకే ఈ శ్లోకంలో 'శ్రీవత్సాంకం' శ్రీవత్స అనే పుట్టుమచ్చ వక్షఃస్థలం లో గలవారు. అంతే గాక వనమాల అనే పరమాత్మకు అసాధారణమైన వైజయంతి మాల గలవాడు. శంఖచక్రములను ధరించినవాడు. అట్టి జగద్గురువైన కృష్ణుని గురించి నమస్కరించుచున్నాను.

ఫలశ్రుతి

**కృష్ణాష్టక మిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ ।**
**కోటిజన్మ కృతం పాపం స్మరణేన వినశ్యతి ॥**

ప్రతి పదార్థం : ఇదం = ఈ, పుణ్యం = పవిత్రమైన, కృష్ణాష్టకం = శ్రీ కృష్ణుని స్తోత్ర రూపమైన ఎనిమిది శ్లోకములతో గూడిన దానిని, ప్రాతః = తెల్లవారు సమయమున, ఉత్థాయ = మేల్కొని, యః = ఎవరైతే, పఠేత్ = చదువునో (అతనికి) కోటి జన్మ = కోటి జన్మలలో, కృతం = చేసిన, పాపం = పాప సముదాయమంత, స్మరణేన = కేవలం స్మరణ మాత్రము చేతనే, వినశ్యతి = నశించి పోవును.

తాత్పర్యము: పవిత్రమై సకలపాపములను పరిహరించు ఈ కృష్ణాష్టకమును తెల్లవారు సమయమున మేల్కొని చదువుకొను వాని కోటి జన్మలలో చేసిన పాపరాశి యంత పటాపంచలై పోవును.

**మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో**



# జ్యోతిర్విజ్ఞానమ్

(13 వ పేజీ తరువాయి)

కావున ఇనుప ఊచలు, ఇనుప తీగలు వాడుతున్న ఈ రోజులలో ప్రాచీనంలో చెప్పిన పద్ధతులు కొంత మార్పుగా ఈ కాలంలో పాటించవచ్చు.

సిమెంట్ నిర్మాణములో ఆ గ్రహములకు ఆయా దిశలకు సంబంధించిన లోహములు, రత్నములు పెట్టడం వలన మణిశిలా, సీసం, బంగారం, వెండి, కంచు, రాగి, సత్తు, అభ్రకం, పాదరసం వీటిని కూడా నిర్మాణంలో వినియోగించడం ద్వారా సమగ్ర శుభ ఫలాలు వస్తాయి అని శాస్త్రవచనము. ఈ నాటి నిర్మాణములలో పిల్లర్స్, శ్లాబ్ వేయు నిర్మాణములో పై వస్తువులు వినియోగించడం ద్వారా గృహము కాంతి వంతమగును. సెంట్రింగ్ పనిలో ఇనుప తీగలతో పాటు రాగి, వెండి, బంగారు తీగ ఉపయోగించటం వలన కూడా వర్ణ వాస్తులో భాగంగా చెప్పవచ్చని అని జ్యోతిష్య శాస్త్రం తెలియజేస్తుంది.

(మిగతా వచ్చే సంచికలో...)

# విజయదశమి

# శరన్నవరాత్రములు

**(8 వ పేజీ తరువాయి)** ఆ విధంగా "వీరలక్ష్మీ పృథగ్గేహే" అన్నట్లుగా విష్ణ్వాలయాలలో ప్రత్యేకమైన ఆలయంలో నెలకొన్న "వీరలక్ష్మీ" అని ఆగమ గ్రంథాలలో పేర్కొన్న చతుర్భుజ లక్ష్మీ దేవికి నవరాత్ర ఉత్సవములు చేయటం సంప్రదాయం. అలా చేసేటప్పుడు శ్రీపాంచరాత్ర శాస్త్ర విధానాన్ని అనుసరించి చతుఃస్థానార్చన ప్రక్రియలో నవరాత్ర పూజలు నిర్వహిస్తారు. చతుఃస్థానార్చన మనగా! 1. విగ్రహము నందు, 2. హోమకుండము నందు, 3. మండలము (యంత్రం ముగ్గువలె వేసి) నందు, 4. కుంభము (కలశంలో) నందు అమ్మవారిని ఆవాహనచేసి పూజిస్తారు.

ఇలా లక్ష్మీదేవిని ఈ నవరాత్ర క్రమంలో చతుఃస్థానార్చనా విధానంలో పూజిస్తే కలిగే ఫలితాన్ని "పరమపురుష సంహిత"

**యస్మిన్ దేశే భవేద్యేత దుత్సవం ప్రతివత్సరం।**
**తస్మిన్ దేశేతు సౌభాగ్య సమృద్ధి స్సర్వతో భవేత్ ॥**

"ఎక్కడైతే లక్ష్మీదేవి ఈ విధానంతో పూజింపబడుతుందో అక్కడ సౌభాగ్య సమృద్ధి కలుగుతుందని" చెప్పింది.

మనకు ఈ శోభకృత్ సంవత్సరంలో అక్టోబర్ 15 నుండి 24 తేదీ వరకు నవరాత్రులతో కూడిన విజయదశమి. ఈ రోజులలో 'శక్తి' ఆరాధన ఎంతో ఫలవత్తరమైనది.

శ్రీరాముడు విజయదశమి నాడే రావణునిపై విజయం సాధించాడనే పురాణ కథను అనుసరించి ఈ నవరాత్రములలో శ్రీరామాయణమును సంపూర్ణముగా పారాయణ చేసి శ్రీరామునికి విజయ దశమి నాడు పట్టాభిషేకం చేసే సంప్రదాయం అనాది కాలంగా ఉన్నది. ఉత్తర హిందూ స్థానంలోనూ భద్రాచలం మొదలగు చోట్లల్లో "శ్రీరామలీల మహోత్సవమ"నే వేడుకను విజయ దశమి నాడు చేస్తారు. చెడుపై మంచి విజయం సాధించే రోజుగా ఈ 'దసరా' ను పేర్కొంటారు. ఆయుధ పూజ, శమీ పూజ, పుస్తక పూజ మొదలగునవన్నీ ఈ విజయదశమి నాడు చేయటం ఆచారం. ఇన్ని విశేషాలుగల ఈ నవరాత్రులను సద్వినియోగం చేసుకొందాం.

**లోకాః సమస్తాః సుఖినో భవన్తు...** ★

# శమీ శమయతే పాపం.....

**(11 వ పేజీ తరువాయి)** నవరాత్రులు ముగిసిన పిదప చివరి రోజున అనగా విజయదశమి రోజున స్వామివారు విజయోత్సవముగా అరణ్యవిహారంగా తన పంచాయుధము లతో వేటకు వెళ్ళుటకు బయలుదేరుతాడు.

అలా విజయదశమి రోజున గ్రామమునకు రెండు కిలోమీటర్ల దూరంలో గల శమీ వృక్ష సమీపమునందు పరివార సహితంగా స్వామిని వేంచేపు చేయిస్తారు. లక్ష్మీ సమేతుడైన ఉగ్ర యోగ నరసింహ మూర్తులతో పాటు లక్ష్మీ వెంకటేశ్వరుడు కూడా శమీ వృక్ష సమీపానికి బయలుదేర తాడు. పంచాయుధములను శమీ వృక్ష సమీపంలో ఉంచి అర్చక స్వాములు భక్తులు పురజనులు అందరూ కలిసి ఆగమ శాస్త్రం ప్రకారం శమీ వృక్ష ఆయుధ పూజలు నిర్వహిస్తారు. ఈ రోజున స్వామివారి పంచాయిధములతో పాటుగా అందరిని సదా రక్షిస్తూ న్యాయ పరిపాలన చేసే గ్రామ రక్షక భటుల యొక్క (స్థానిక పోలీస్ స్టేషన్ లోని) ఆయుధాలను కూడా స్వామివారి పంచాయుధములతో పాటుగా పూజించుట ధర్మపురి క్షేత్రమందు ఒక ఆనవాయితీగా వస్తున్న విశేషమైన సాంప్రదాయం. ఆ సమయంలో శమీ వృక్ష పూజ స్వామివారి ఆయుధ పూజ రక్షకభటుల ఆయుధ పూజ జరిగిన తర్వాత పోలీసులు పూజించిన వారి ఆయుధాలను తీసుకొని గాలిలో ఒక మారు కాల్పులు జరుపుట ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఈ విధంగా ధర్మపురి క్షేత్రమందు విజయదశమి ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది. వంశపారంపర్యంగా భక్తితో స్వామి ఆరాధనలు జరిపే అర్చకులు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అత్యంత అపురూపంగా, విశేషంగా నిర్వహించే ఈ ఉత్సవంలో ఎంతోమంది భక్తితో ఆసక్తితో పాల్గొంటారు.

విజయదశమి రోజున దేవాలయాల్లో భగవంతుని దర్శించి శమీ వృక్షాన్ని పూజించి, శమీ పత్రాన్ని శిరస్సున ధరిస్తే వారి పాపములు ప్రక్షాళనం అవుతాయి. శత్రువినాశనం కలుగుతుంది. ధర్మపురి శ్రీ ఉగ్ర, యోగ నరసింహుల అనుగ్రహంతో ఈ విజయదశమి రోజున లోకమంతా సురక్షితంగా, సుభిక్షంగా, సస్యశ్యామలమై ధర్మ పరిరక్షణ కావించబడాలని సదా ప్రార్థిస్తూ స్వస్తి.

**- నంబి అరుణ్ కుమారాచార్య వంశపారంపర్య అర్చకులు**
**శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మపురి.** ★

# ఆధ్యాత్మిక వార్తలు



బీర్‌పూర్‌లో వినాయకుల వద్ద సహస్ర దీపాలంకరణ సేవ



కొండపలకలలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు



నిజామాబాద్ జిల్లా నర్సింగ్ పల్లి ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో 25-09-23 సోమవారం రోజు స్వామివారి తిరు అభిషేక మహోత్సవ సందర్భంగా స్వామివారి బలి బేరంతో అష్టదిక్పాలకులకు బలి నిర్వహించి స్వామివారికి అభిషేకము, నైవేద్యము, తీర్థ ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని వారి కోర్కెలు తీరడానికి ఆలయం బయట ఉన్న స్వామివారి వృక్షానికి కౌతుకము కట్టారు. ఈ కౌతుకము కోరిక తీరిన తర్వాత వచ్చి విప్పవలసి ఉంటుంది.




సంప్రదాయ విశేషాలను శ్రోతృజన రంజకముగా ప్రవచనము చేయు ప్రముఖ పండితులచే మూడు రోజుల పాటు ఇతిహాస పురాణ దివ్య ప్రబంధములపై సదస్సు. తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, ఉభయ వేదాంత పండిత పరిషత్, భాగ్యనగర్ శాఖ, శ్రీ వైష్ణవ సేవా సంఘం తెలంగాణ, హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో ప్రత్యేక విద్వత్ సదస్సును సెప్టెంబర్ 30 అక్టోబర్ 1, 2 తేదీలలో హైదరాబాద్, సైదాబాద్ కాలనీలోని శ్రీమత్ సుదర్శన లక్ష్మణ హనుమత్ సమేత సీతారామచంద్ర స్వామి దేవాలయములో జరగనున్నాయి.



## అంగరంగ వైభవంగా
## అనంత పద్మనాభ స్వామి వ్రతం

మానేటి నది తీరాన వెలిసిన స్వయంభూ శ్రీ మానేటి భూనీలా సహిత రంగనాయక స్వామి దేవస్థానంలో 28-09-2023 రోజున కన్నుల పండుగగా పద్మనాభ స్వామి వ్రతం జరిగింది. స్వామి వ్రతంలో సుమారు నాలుగు వందల మంది భక్తులు పాల్గొన్నారు. అనంతపద్మనాభ స్వామి వ్రతం తో పాటుగా ప్రత్యేక పూజలు చేసి కోటి వత్తులను వెలిగించి ఆ పరమాత్ముడికి సమర్పించి మానేటి నదిలో వదులుతారు. ఆలయ ఆస్థాన పురోహితులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, గోవర్ధనగిరి రాజ్ కుమార్ ఆచార్యులు,యాజ్ఞికులు గోవర్ధనగిరి వేణు, జగన్నాథ ఆచార్యులు,మనోజ్ వెంకటరమణ, సముద్రాల విజయసారథి, నీరుకుల్ల వేగురుపల్లి గ్రామాల సర్పంచులు విజేందర్, మాజీ ఉపసర్పంచ్ అడ్డగుంట రవీందర్, ఆలయ కమిటీ సత్యనారాయణ, పెరుమారెడ్డి, ధర్మారెడ్డి మహేందర్ రెడ్డి, దామోదర్, గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. ఆలయ పురోహితులు రాజ్ కుమార్ ఆచార్య అనంత పద్మనాభ స్వామి వ్రతం గురించి తెలియజేశారు.